RNI NO. APTEL/2006/18110

### హోర్ముజ్ జలసంధి
## దాటిన మరో రెండు నౌకలు

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఏర్పడిన ఇంధన సంక్షోభం నుంచి భారత్‌కు ఉపశమనం లభిస్తోంది. కీలకమైన స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ దాటి భారత్‌కు పెట్రోలియం ఉత్పత్తులను మోసుకొస్తున్న మరో రెండు వాణిజ్య నౌకలు సురక్షితంగా ప్రయాణిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. భారత నౌకాదళం ఈ నౌకల ప్రయాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన రక్షణ కల్పిస్తున్నాయి. భారత నౌకాదళ యుద్ధనౌకలు ఈ జలసంధి సమీపంలో 'స్టాండ్‌బై'లో ఉన్నాయి. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేశారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

ప్రజాగళం PGN NEWS

నిజామాబాద్ సంపుటి: 21 సంచిక: 102 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ ఆదివారం, మార్చి 29, 2026 పేజీలు : 8 వెల : 1.00

## చిన్నారుల కోసం 'తొలి ముద్ద'
### పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి,28:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో సుపరిపాలన అందిస్తున్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండింటిని జోడెద్దుల్లా పరుగులు పెట్టిస్తున్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ ఏదో ఒక పథకాన్ని అమలు చేస్తున్నారు. తాజాగా మరో స్కీమ్‌కు సీఎం శ్రీకారం చుట్టారు. అంగన్వాడీ చిన్నారులకు అల్పాహారం అందించేందుకు 'తొలి ముద్ద' అనే పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఉప్మా, కిచిడీ మిక్స్‌ను బ్రేక్‌ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..' గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చార. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టింది' అని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు.
అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదని, సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం



కుటుంబ సభ్యుల్లా భావిస్తోందని వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామన్నారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ,
ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అలానే ఎల్బీ స్టేడియంలో లెజిస్లేటర్స్‌స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ ఆటల పోటీలు నేడు, రేపు కొనసాగనున్నాయి. రేపు రవీంద్ర భారతిలో కల్చలర్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

## కాళేశ్వరం...
## పాపం కేసీఆర్‌దే
### కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, మార్చి 28: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి తెలంగాణ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపి పెట్టుకొని ప్రాజెక్టును డిజైన్ చేసింది ఆయనే. ఈ ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అధికార ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది. ప్రజలు సైతం ఆయన భాషపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు



చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయన వ్యవహార శైలి మార్చుకుంటే మంచిది' అని అన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడతారనే ప్రచారంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ..'తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇది సంకేతం. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ స్థాపించే హక్కు కలిగి ఉంటారు. అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించింది. కవిత కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచనను స్వాగతిస్తున్నాం' అని అన్నారు.

### ఎస్ఐఆర్ వర్సెస్ అల్లర్లు..
## బెంగాల్‌లో వేడెక్కిన ఎన్నికల ప్రచారం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ లో ఎన్నికల వాతావరణం శనివారంనాడు ఒక్కసారిగా వేడెక్కింది. ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రధానాస్త్రంగా చేసుకుని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రచారం సాగించగా, శ్రీరామ నవమి ఊరేగింపులో అల్లర్లు, చొరబాటుదార్ల సమస్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రచారం జరిపారు. శ్రీరామ నవమి అల్లర్లకు బీజేపీనే కారణమని మమత విమర్శలు గుప్పించగా, దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ సజావుగా జరుగుతుంటే పశ్చిమబెంగాల్‌లోనే న్యాయ అధికారులను మోహరించాల్సి వచ్చిందని అమిత్‌షా తప్పుపట్టారు. కోల్‌కతాలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో అమిత్‌షా మాట్లాడుతూ, రాష్ట్రంలో తిష్టవేసిన చొరబాటుదారులు బెంగాల్ భవిష్యత్తును నిర్ణయిస్తుంటే చూస్తూ ఊరుకుందామా? అని ప్రజలను ప్రశ్నించారు. ప్రతి ఒక్క చొరబాటుదారుని గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగించడానికే పరిమితం కాకుండా దేశం నుంచి వెళ్లగొడతామని, ఇది బీజేపీ ఎజెండా అని స్పష్టం చేశారు. టీఎంసీ ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల సిలిగురి



కారిడార్ భద్రతకు ప్రమాదం ఉందని అన్నారు. ఒకరకంగా దేశ భద్రత బెంగాల్ ఎన్నికలతో ముడిపడి ఉందని, చొరబాటుదారులు ప్రవేశిస్తున్న ఏకైక రాష్ట్రంగా పశ్చిమబెంగాల్ నిలుస్తోందని ఆరోపించారు.

### ఫైళ్లకే పరిమితమైన ప్రాజెక్టులను
## పట్టాలెక్కించాం: ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ,మార్చి,28:** నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంలో గత ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 2004 నుంచి 2014 మధ్య కాలంలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కేవలం ఫైళ్లకే పరిమితమైందని, అభివృద్ధి పట్లకాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలకు ఉన్న చిత్తశుద్ధి లేమికి ఇది నిదర్శనమని ఆయన ఆరోపించారు. ఒకప్పుడు కేవలం కాగితాల మీద మాత్రమే ఉన్న జేవార్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్.. నేడు క్షేత్రస్థాయిలో వాస్తవ రూపం దాల్చుతోందని ప్రధాని అన్నారు. 2004లో ప్రతిపాదించినప్పటికీ.. పదేళ్ల పాటు కేంద్రంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న ఎస్పీ ప్రభుత్వం దీనిని ముందుకు తీసుకెళ్లడంలో విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరప్రదేశ్ పశ్చిమ ప్రాంత అభివృద్ధిని గత పాలకులు అడ్డుకున్నారని ఆరోపించారు. 2014 తర్వాత దేశంలో, 2017 తర్వాత ఉత్తరప్రదేశ్‌లో వచ్చిన మార్పుల వల్ల ఆగిపోయిన ప్రాజెక్టులన్నీ వేగవంతమయ్యాయని మోదీ చెప్పుకొచ్చారు. పర్యావరణ, భూసేకరణ వంటి క్లిష్టమైన సమస్యలను పరిష్కరించి ప్రాజెక్టులను పట్టాలెక్కించినట్లు తెలిపారు. జేవార్ ఎయిర్‌పోర్ట్ కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, ఇది ఈ ప్రాంతానికి 'లాజిస్టిక్స్ గేట్‌వే'గా మారుతుందని ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది మంది యువతకు ఉపాధి లభించడమే కాకుండా, పశ్చిమ యూపీ పారిశ్రామిక హబ్‌గా మారుతుందని స్పష్టం చేశారు. 'పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదు?' అని ప్రధాని ప్రతిపక్షాలను మోదీ ప్రశ్నించారు. కేవలం ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం కాకుండా, పని చేసి చూపించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఇలా ఉండగా, నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తయితే.. ఇది ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయాలలో ఒకటిగా నిలవనుంది.

### నక్సలిజంపై పోరు..
## మార్చి 30న కేంద్రం కీలక ప్రకటన



**న్యూఢిల్లీ,మార్చి,28:** భారతదేశ అంతర్గత భద్రతకు దశాబ్దాలుగా సవాలుగా మారిన నక్సలిజం సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగు వేస్తోంది. ఈ క్రమంలోన మార్చి 30న లోక్ సభలో నక్సలిజం నిర్మూలనపై ఒక చరిత్రాత్మక చర్చకు తెరలేవనుంది. దేశ వ్యాప్తంగా మావోయిస్టుల ప్రభావాన్ని పూర్తిగా తుడిచి పెట్టేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతంలో ప్రకటించిన 'మార్చి 2026' గడువు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈ చర్చ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.
లోక్‌సభలో రూల్ 193 కింద ఈ స్వల్పకాలిక చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే ఈ చర్చను ప్రారంభించనున్నారు. దేశ వ్యాప్తంగా నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వంతీసుకుంటున్న భద్రతాపరమైన చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సభ దృష్టికి తీసుకురానున్నారు. కేవలం ఆపరేషన్‌లే కాకుండా, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్, విద్య, వైద్య సదుపాయాల కల్పన ద్వారా ప్రజలకు ఎలాంటి సేవలందిస్తున్నారన్న అంశంపై సుదీర్ఘ చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది.

### సరిగ్గా 11:11 నిమిషాలకు అమరావతి
## చట్టబద్ధత బిల్లును ప్రవేశపెట్టిన చంద్రబాబు

అమరావతి,మార్చి 28: ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం శనివారం) ఉదయం ప్రారంభమైంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లును ప్రవేశపెట్టారు. ఉదయం సరిగ్గా 11 గంటల 11 నిమిషాలకు శాసనసభలో ఈ బిల్లును సీఎం ప్రవేశపెట్టడంతో తీర్మానంపై చర్చ మొదలైంది. తీర్మానంపై 20 మందికి పైగా సభ్యులు మాట్లాడనున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ చర్చలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. ఈ శాసనసభ సమావేశానికి ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు.రాష్ట్ర ప్రగతికి ఎదురయ్యే సవాళ్లను అధిగమించే యజ్ఞం ఈ సమావేశంతో మొదలవుతోందని స్పీకర్ అన్నారు. 2014లో నడిసంద్రంలో చుక్కాని లేని నావలా ఆంధ్రప్రదేశ్ ఉందని.. అలాంటి సమయంలో దార్శనికుడు చంద్రబాబుకు రాష్ట్రాన్ని ప్రజలు అప్పగించారని తెలిపారు. చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపించాలని ప్రణాళికలు రూపొందించారన్నారు. అందరి సంప్రదింపులతో అమరావతిని రాజధానిగా ఖరారు చేశారని అన్నారు. ఈ ప్రాంతంలోని రైతులు తమ ప్రాణప్రదమైన భూములను రాజధాని కోసం విరాళంగా ఇచ్చారని తెలిపారు. అన్నదాతల అండతోనే రాజధానికి భూమి లభించిందని... అమరావతి రాజధాని పనులు వేగంగా ముందుకు సాగాయని స్పీకర్ తెలిపారు. 2019లో అమరావతికి అడ్డంకులు ఎదురయ్యాయన్నారు స్పీకర్. మూడు రాజధానుల పేరిట తప్పుడు నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడు పాత నిర్ణయాలు కొనసాగించాలనే సూత్రానికి విరుద్ధంగా అప్పటి ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. చేతికి కొబ్బరికాయ చిక్కినట్లు ప్రవర్తించి, అప్రజాస్వామిక విధానాలతో రాష్ట్రం 50 ఏళ్లు వెనక్కు వెళ్లిందని వ్యాఖ్యానించారు. పాలకులు కూడా విధ్వంసానికి పాల్పడవచ్చని ఈ సంఘటనలు నిరూపించాయని స్పీకర్ వెల్లడించారు. అలాంటి



పరిస్థితి పునరావృతం కాకుండా అమరావతిని శాశ్వత రాజధానిగా చేస్తున్నారని స్పీకర్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ధృడ సంకల్పం ఫలితంగా దీనికి కేంద్ర ప్రభుత్వం సమ్మతించిందన్నారు. ఈ మేరకు అమరావతి రాజధానిగా తీర్మానం చేసేందుకు అవకాశం వచ్చిందని తెలిపారు. తెలుగు ప్రజలు గర్వించదగ్గ రోజు ఇది అని చెప్పుకొచ్చారు. ఈ చరిత్రాత్మక సమావేశానికి 11 మంది వస్తారని అనుకున్నామని.. చేసిన తప్పును ఒప్పుకునే ధైర్యం వారికి లేదని తెలిసిపోయిందన్నారు. అమరావతి తీర్మానంపై జరిగే చర్చచరిత్రలో నిలిచిపోతుందనితెలిపారు. 'ఇలాంటి చరిత్రాత్మక సందర్భంలో మాట్లాడే అవకాశం మీ అదృష్టం. అందరూ అర్థవంతంగా చర్చలో పాల్గొని మాట్లాడాలి' అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు.

### ఏపీకి అమరావతి మాత్రమే రాజధాని..
## తేల్చి చెప్పిన డిప్యూటీ సీఎం పవన్..

అమరావతి, మార్చి 28: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉందని, అది అమరావతి మాత్రమేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. చంద్రబాబులాంటి వ్యక్తి చేతిలో ఏపీ ఉంటేనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాజధాని కోసం రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. వైసీపీ పాలనలో అమరావతిపై కక్ష కట్టారని, మూడు రాజధానులంటూ మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ప్రజలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పవన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. తెలంగాణ వేరు.. ఏపీ వేరు అనే భావన మాకెప్పుడూ లేదు. తెలుగునేల అనేదొక్కటే మా భావన. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు. రాజధాని లేని రాష్ట్రంగా మనం ఇంకా కొట్టుకుంటూనే ఉన్నాం. ఏపీ నేలపై ప్రేమతోనే ఎలాంటి షరతులు



లేకుండా టీడీపీతో కలిశాం. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే కూటమిగా ఏర్పడ్డాం. వైసీపీ హయాంలో ఎక్కడ చూసినా అరాచకమే. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే మహిళలు భయపడేవారు. ప్రశ్నించిన అందరిపైనా దాడులు చేశారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నగర పాలక సంస్థ 2026-2027 సంవత్సరపు బడ్జెట్ ఆమోదం



నిజామాబాద్ నగరపాలక సంస్థ 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదించిన బడ్జెట్ ఆమోదం పొందింది. శనివారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ కూరగాయల ఉమారాణి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో శాసన మండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ శాసన సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు. 2026-2027 సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదిత బడ్జెట్ తో పాటు, 2025 - 2026 సవరించిన అంచనా బడ్జెట్ ను సమావేశంలో ప్రవేశపెట్టగా, కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2025 ఏప్రిల్ 01 నాటికి ప్రారంభ నిల్వ రూ. 9471.33 లక్షలు, 2025-2026 సవరణ అంచనా ఆదాయం రూ. 13717.11 లక్షలు కలుపుకుని మొత్తం రూ. 23188.44 లక్షలుగా పేర్కొన్నారు. 2026-2027 సంవత్సరపు సాధారణ నిధుల అంచనా ఆదాయం రూ. 14763.60 లక్షలుగా బడ్జెట్ లో పొందుపర్చారు. ప్లాన్ అండ్ నాన్ ప్లాన్ గ్రాంట్ల ద్వారా రూ. 9937.00 లక్షల ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. అదేవిధంగా మొత్తం అంచనా వ్యయం రూ.24700.60 లక్షలుగా బడ్జెట్ పద్దులో పేర్కొన్నారు. ప్రతిపాదిత బడ్జెట్ వివరాలను సమావేశంలో చదివి వినిపించగా, సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా తమతమ డివిజన్లలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్లు ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ ఇలా త్రిపాఠి సానుకూలంగా స్పందించారు. ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితం అని,నిజామాబాద్ నగర అభివృద్ధే ధ్యేయంగా అందరం పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ సూచించారు. నిజామాబాద్ నగరానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరగా, సానుకూలంగా స్పందించారని అన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులో అన్ని డివిజన్లకు సమ ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా నిజామాబాద్ లో మాస్టర్ ప్లాన్ అమలు అనివార్యంగా మారిందని అన్నారు. ఇప్పటికే ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపకల్పన జరిగిందని, ఎవరికీ ఎలాంటి అన్యాయం జరుగకుండా ఉండేందుకు ముసాయిదా ప్లాన్ లో ఏవైనా సవరణలు



చేయాల్సి ఉంటే వాటిని చేపట్టేందుకు వీలుగా కార్పొరేటర్లతో కూడా భేటీ నిర్వహించాలని సూచించారు. కాగా, ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం వాటిల్లకుండా, వారికి జవాబుదారీగా వ్యవహరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు.

కార్పొరేటర్లు ప్రస్తావించే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అంకిత భావంతో కృషి చేయాలన్నారు. ఆయా డివిజన్లలో నెలకొని ఉన్న సమస్యలపై చర్చించి, పరిష్కారం చూపేందుకు వీలుగా నెల రోజుల లోపే మేయర్ అనుమతి తో నగర పాలక సంస్థ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని సూచించా రు. కార్పోరేషన్ కు ఆదాయ వనరులను పెంపొందించుకునేం దుకు వీలుగా ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా పారదర్శకంగా పరిష్కరిస్తూ అర్హత కలిగిన వారికి అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. సానిటేషన్ పనులు పక్కాగా పర్యవేక్షణ జరిపేందుకు వీలుగా వాట్స్ యాప్ గ్రూప్ లను ఏర్పాటు చేసుకుని, సిబ్బంది పనితీరును నిశితంగా పరిశీలించాలని కమిషనర్ కు సూచించారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది హాజరును ఫేషియల్ రికగ్నిషన్ విధానం ద్వారా అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, నగర పాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనివ్వండి...

## నిజామాబాద్ ను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లండి

## నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



నిజామాబాద్ మార్చ్ 28 (ప్రజా గళం ప్రతినిధి) నిజామాబాద్ నగర అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత కల్పించాలని శాసనమండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. శనివారం నిర్వహించిన నిజామాబాద్ నగర పాలక సంస్థ తొలి బడ్జెట్ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.నిజామాబాద్ నగర పాలక సంస్థ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై కీలక సూచనలు చేశారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, స్ట్రీట్‌లైట్లు వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండే సేవలను వేగవంతం చేయాలని, ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నగరస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా నిజామాబాద్‌ను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, బడ్జెట్‌లో ప్రతిబింబించే విధంగా ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.నగర అభివృద్ధికి అవసరమైన నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, పారదర్శకతతో పనులు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# కవిత నీ కొత్త పార్టీ పేరు లిక్కర్ పార్టీ అని పెట్టుకో...

## ఎంపీ అరవింద్ ను విమర్శిస్తే ఖబర్దార్

## కల్వకుంట్ల కవితపై బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దాంపల్లి జ్యోతి ఫైర్.



నిజామాబాద్ సిటీ మార్చి 28 (ప్రజాగళం) : కల్వకుంట్ల కవిత మతిభ్రమించి మాట్లాడుతున్నారని బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దాంపల్లి జ్యోతి ఆరోపించారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 39 వ డివిజన్ కార్పొరేటర్ దాంపల్లి జ్యోతి కవితపై ఘాటుగా విమర్శలు చేశారు. లిక్కర్ కేసులో కోట్లు సంపాదించిన మీరు కొత్త పార్టీ పేరు లిక్కర్ పార్టీ అని పెట్టుకుంటే బాగుంటుందని ఆమె హితవు పలికారు. ఎందరో యువతీ యువకుల ఆత్మ బలిదానాలతో ఏర్పడ్డ తెలంగాణను పదేళ్ల పాలనలో మీ డాడీ సగం తెలంగాణను నాశనం చేస్తే మీరు కొత్త పార్టీ అంటూ మిగిలిన సగాన్ని నాశనం చేసేందుకు వస్తున్నారని ఆమె ఆక్షేపించారు. మీ సొంత ఇంట్లోనే మీకు విలువ లేదని అలాంటిది రాష్ట్రాన్ని ఏశీ ఉద్ధరిస్తారని కొత్త పార్టీ పేరిట కోట్లు ఖర్చు పెడుతున్నారని దాంపల్లి జ్యోతి ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన డబ్బులతో కొత్త పార్టీ అంటూ కొత్త నాటకానికి తెర లేపారని జ్యోతి దుయ్యబట్టారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తుంటే చూసి ఓర్వలేక ఎంపీ అరవింద్ పై అవాకులు చవాకులు పేల్చడం సిగ్గుచేటు అన్నారు.

మరోసారి ఎంపీ అరవింద్ ను విమర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆమెహెచ్చరించారు. జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్ఓబీలను పూర్తి చేసేందుకు ఎంపీ అరవింద్ ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. గత పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న మీరు ప్రజలకు ఏం చేశారని కొత్త పార్టీ పెడుతున్నారని, కోట్లు గడించినకొత్త పార్టీ పేరు లిక్కర్ పార్టీ అని పెట్టుకుంటే కవితకు సరిగ్గా సరిపోతుందని దాంపల్లి జ్యోతి ఎద్దేవా చేశారు.

ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ మహిళా కార్పొరేటర్ లు కరిపె అర్చనా చిరంజీవి, చింత ప్రసన్న శ్రీనివాస్, దాత్రిక రేవతి పరమేశ్వర్, ఇప్పకాయల సుమిత్ర దేవి తదితరులు పాల్గొన్నారు.

# ఎడపల్లి శ్రీరామ మఠంలో కన్నులపండువగా, శ్రీ సీతరా ముల వారి కళ్యాణోత్సవ వేడుకలు..

## అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు... వేదమంత్రాలతో ఒకటైన శ్రీ సీతారాముల నూతన దంపతులు....



ఎడపల్లి.మార్చి 27(ప్రజా గళం): ఎడపల్లి మండల కేంద్రంలోని శ్రీరామ మఠంలో శుక్ర వారం కనుల పండువగా శ్రీ సీతరాముల వారి కల్యాణోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా,కన్నుల పండు వగా జరిగాయి.శ్రీ రామ మఠం ఆధ్వర్యంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని కల్యాణోత్సవ వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.వధువు సీతమ్మ తల్లిని మరియు వరుడు శ్రీరాముడిని వారి వారి పుట్టిం టి నుండి కుటుంబ సభ్యులు(భక్తులు)బాజా భజంత్రి, సన్నాయి మేళలతో వేరు వేరుగా ఎదుర్కోలుతో కల్యా ణ మండపానికి వారిని తోడుకొని వచ్చారు. సుమారు 378 సంవత్సరాల నుండి శ్రీరామ మఠంలో శ్రీరామ నవమి ఉత్సవ కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నా యని మఠం పిఠాధిపతి అన్న జయరామ్ మహారాజ్ తెలిపారు..కల్యాణ మండపం పై శ్రీసీతరాముల వారిని పలు అలంకరణలతో తీర్చిదిద్ది వధు వరులను తయారు చేసి వేదపండితుల మంత్రా లతో సీతరాముల వారి కి వివాహ కార్యక్రమాలు నిర్వహించారు.ఎడపల్లి గ్రామంలోని శ్రీ రామ మఠంలో శ్రీసీతారాముల వారి కల్యాణనోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగా యి.స్వామివారి కల్యానోత్సవ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ సీతరాముల స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం గ్రామ పెద్దలు,గ్రామస్తుల సమక్షంలో అర్చకులు వేదమంత్రాలతో కల్యాణోత్సవ కార్యక్రమాన్ని కన్నులపండువగా కమనీయంగా జరిపించారు.ఈ సందర్భంగా కళ్యాణ వేడుకలకు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.సీతా రాముల వారికి స్థానిక సర్పంచ్ కందగట్ల రాంచందర్ (అన్నాసేట్)పట్టు వస్త్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య కల్యాణ వేడుకలు కమణీయంగా జరిపించారు.వధువరులు ఇరువురు ఒకరి తలపైన ఒకరు తమలపాకు జిలకర బెల్లం పెట్టి వివాహ వేడుకలు నిర్వహించారు.రాముల వారు సీత మెడలో తాళి కట్టడంతో కల్యాణ వేడుకల కు విచ్చేసిన భక్తులు నూతన దంపతులకు అక్షింతలు వేసి ఆశీస్సులుఅందజేయగా,శ్రీ సీతారాముల స్వామి వారు భక్తులను ఆశీర్వదించారు.సీతాముల స్వామి వారి కల్యాణ వేడుకలను భక్తులు కనులారా తిలకించి, తరించి తన్మాయులయ్యారు.ఈ కల్యాణ మహోత్సవ వేడుకల కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కందగట్ల రాంచందర్,ఉపసర్పంచ్ మచ్చూరి గంగాధర్,శ్రీరామ మఠం పిఠాధిపతి అన్న జయరామ్ మహారాజ్,పరశు రామ్ మహారాజ్,సురేష్ ఆత్మరాం మహారాజ్,సాంబా మహారాజ్,ఆర్పీ శర్మ, శ్రీపాద్ శర్మ,రాజేష్ జోషి, ధనుంజయ్,మాజీ సర్పంచ్ ఆకుల మాదవి శ్రీనివాస్, మాజీ జడ్పి వైస్ చైర్ పర్సన్ రజిత యాదవ్,మాజీ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్,మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు,మాజీ సొసైటీ చైర్మన్ లు పోలమల్కారెడ్డి, కరుణం శంక ర్ రావు,నాయకులు ఎల్లయ్య యాదవ్, న్యావనంది గోపాల్,ఆత్మేల శ్రీనివాస్ ముదిరాజ్, గంగాధర్ ముది రాజ్,మనోజ్ ముదిరాజ్,నటరాజ్ గౌడ్,భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన విఆర్ దేశాయ్‌కి ఘనంగా సన్మానం



బోధన్ ప్రతినిధి,మార్చి 27: (ప్రజా గళం): బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సీని యర్ న్యాయవాది వెంకటేశ్వర్ రావు దేశాయ్ (విఆర్ దేశాయ్)ని శుక్రవారం బీఆర్ఎస్ బోధన్ పట్టణ కమిటీ నాయకులు ఘనంగా సన్మానించారు.ఆయన నివాసం లో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాండ్ల రవీందర్ యాదవ్‌తో పాటు నాయకులు శాలువా కప్పి సన్మానించా రు.ఆయనకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు నాగుల రవిశంకర్ గౌడ్,నరేశ్,శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ 'ఆత్మ' చైర్మన్ వక్కలపూడి కృష్ణారావుని ఘనంగా సన్మానించిన ఎస్సిసెల్ జిల్లా అధ్యక్షులు ఈరంటీ లింగం..



ఎడపల్లి,మార్చి 27: (ప్రజా గళం): బోధన్ డివిజన్ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ చైర్మన్ గా వక్కలపూడి కృష్ణారావు ఏకగ్రీవంగా ఎన్నికైనశుభసందర్భంగా,శుక్రవారం ఆత్మ చైర్మన్ ను ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు ఈరంటీ లింగం శాలువ కప్పి పూల వేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్బం గా ఈరంటి లింగం కృష్ణారావు కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సిసెల్ జిల్లా అధ్యక్షులు లింగం మాట్లాడుతూ..ఆత్మ చైర్మన్ గాఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామ రైతు నాయకులు వక్కలపూడి కృష్ణా రావు ని ఎన్నుకోవడం అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు.వ్యవసాయ రంగంలో సాంకేతికతను పెంపొందిం చ డానికి,రైతు సమస్యల పరిష్కారానికి,ప్రభుత్వం ద్వారా రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా కమిటీ కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు..ఈ సన్మాన కార్యక్రమంలో నాయకులు సూర్య నారాయణ, మధన్ భాస్కర్,నరేందర్,చౌదరితో పాటు పలువురు రైతులు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పదవ తరగతి పరీక్షలు

## పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, మార్చి 28 (ప్రజా గళం ప్రతినిధి) : జిల్లాలో పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని బ్లూమింగ్ బర్డ్స్ స్కూల్, ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. పరీక్ష కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను, సీసీ కెమెరా వ్యవస్థను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, బందోబస్తు, తాగునీరు, ప్రథమ చికిత్స వసతి తదితర విషయాలను గమనించారు. బ్లూమింగ్ బర్డ్స్ స్కూల్ లో పరీక్షల నిర్వహణలో పలు లోపాలను గుర్తించిన కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ కు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. తక్షణమే బ్లూమింగ్ బర్డ్స్ స్కూల్ ను సందర్శించి నిర్వహణాపరమైన లోపాలను చక్కదిద్దాలని సూచించారు. విద్యార్థులు దగ్గర దగ్గరగా కూర్చుండి పరీక్షలు రాస్తున్నారని, మరో ఐదు అదనపు గదులను పరీక్షల నిర్వహణ కోసం వినియోగించాలని, సిట్టింగ్ అరేంజ్మెంట్ పక్కాగా ఉండాలని అన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని అన్నారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చూడాలని అన్నారు. పరీక్షలు పూర్తయ్యేంత వరకు అధికారులు సమన్వయంతో పని చేస్తూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు సత్యకుమారి, ఎస్.వెంకట్రామ్ రెడ్డి ఉన్నారు.

# జైతాపూర్ లోని అంగన్ వాడి కేంద్రంలో ఉచిత విద్యు త్ మీటర్ ఏర్పాటు చేసిన అధికారులు



ఎడపల్లి,మార్చి 27 (ప్రజా గళం): ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామంలోని అంగన్ వాడి కేంద్రంలో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సౌక ర్యం కల్పించి మీటర్ ను ఏర్పాటు చేశారు.ప్రతి అంగన్ వాడి కేంద్రానికి ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించా లని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తోంది. దాంట్లో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రతి అంగన్ వాడి కేంద్రానికి ఉచితంగా విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు..ఈ మేరకు ఆ శాఖ అధికారులు అంగన్ వాడి కేంద్రాలను గుర్తించి విద్యుత్తు సౌకర్యం లేని అంగన్ వాడి కేంద్రాలలో విద్యుత్ సౌకర్యం కల్పి స్తూ ఉచితంగా మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు.శుక్ర వారం జైతాపూర్ గ్రామంలోని అంగన్ వాడి కేంద్రంలో అధికారులు విద్యుత్ మీటర్ ని బిగించారు.వేసవి కాలం దృష్ట్యా అంగన్ వాడి కేంద్రానికి వచ్చే చిన్నారి బాల,బాలికలకు ఉక్కపోత(వేడి)ఇబ్బంది నుండి చల్లని వాతావరణం కల్పించేందుకు సెంటర్ లో కరెంట్ ఎంతగానో ఉపయోగ పడుతుంది.విద్యుత్ సరఫరాతో సెంటర్ లో ఫ్యాన్ లు ఏర్పాటు చేసుకొనే అవకాశం కల్పించి అధికారులు సమ్మర్ సమస్య నుండి ముక్తి కల్పిస్తున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, సర్పంచ్ ల సమైక్య మండల అధ్యక్షులు,సర్పంచుల సమైక్య నిజామాబాద్ జిల్లా పోరం ప్రధాన కార్యదర్శి నాగుల రాజుగౌడ్,లయన్ ఆర్గనైజర్ కరుటూరి సూర్య నారాయణ, అంగన్ వాడి టీచర్ వకుళ దేవి, లైన్ మెన్ లు గజానంద్, నవీన్,తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## 'పాశ్చాత్య నాగరికత'

'పాశ్చాత్య నాగరికత'ను సంరక్షించుకోడానికి యూరోపియన్ దేశాలన్నీ తమ తమ దేశాల్లోకి బైటనుంచి వచ్చే వలసలను పరిమితం చేయాలని అమెరికా పిలుపునిచ్చిందన్నదే ఆ కథనం సారాంశం. ఈ 'పాశ్చాత్య నాగరికత' అనేది చాలా విలువైనదని అనుకోవడం గాని,దానిని ఎలాగైనా కాపాడాలని అనుకోవడం గాని మూడవ ప్రపంచ దేశాలలోని చాలామందికి హాస్యాస్పదంగా అనిపిస్తుంది. పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాలు గత కొన్ని శతాబ్దాలుగా తక్కిన ప్రపంచం లోని దేశాల ప్రజలమీద సాగించిన దురాగతాలు, అత్యాచారాలు తలుచుకుంటేనే మన రోమాలు నిక్కబొడుచుకుంటాయి. సామ్రాజ్యవాద దేశాల 'నాగరికత' అటువంటి వికృతమైనది. అసలు వారి ప్రవర్తన వికృత రూపాన్ని కప్పిపుచ్చడానికి 'నాగరికత' అన్న పదంతో దానికి ముసుగు వేయడమే సహించరానిది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అనుసరించిన విధానాల వలన తలెత్తిన కరువుల ఫలితంగా భారతదేశంలో కోట్లాదిమంది ప్రాణాలను కోల్పోయారు. నిస్సహాయులైన భారత రైతాంగం నుండి ఆదాయాన్ని పిండుకోడానికి దురాశాపూరితంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వ్యవహరించిన పర్యవసానమే ఈ కరువులు. కాంగో ప్రజలమీద బెల్జియం రాజు లియోపాల్డ్ మాటలతో చెప్పడానికి అలవికాని క్రూరత్వాన్ని ప్రదర్శించాడు. నమీబియాలో జర్మనీ నిర్వహించిన నిర్బంధ శిబిరాల్లో ఏకంగా కొన్ని తెగలకు తెగలే కనుమరుగైనాయి. పాశ్చాత్య నాగరికత గురించి ఏమనుకుంటున్నారని గాంధీజీని ఒక విలేకరి అడిగితే చాలా వ్యంగ్యంగా అటువంటి 'నాగరికత' వారికి ఉండి వుంటే బాగుండేది అని ఆయన జవాబిచ్చారట. అయితే ఈ క్రూరత్వాన్ని అంతటినీ పక్కన బెట్టి కాస్సేపు పశ్చిమ దేశాలు భౌతిక సంపద విషయంలో సాధించిన పురోగతి పైనే దృష్టి సారిద్దాం. పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాలు మూడవ ప్రపంచ దేశాలను దోపిడీ చేసే విధానాలను అనుస రించడం ద్వారానే తమ పాదార్థిక అభివృద్ధిని సాధించగలిగాయి. దాని వలన ఏర్పడిన ఫలితాల ప్రభావం నుండి తప్పించుకుని ఎలాగైనా బైట పడాలని ఇప్పటికీ ఆ మూడవ ప్రపంచ దేశాల ప్రజానీకం నానా తిప్పలూ పడుతున్నారు. పశ్చిమ దేశాలు తమ స్వతంత్రమైన ప్రత్యేక శక్తి సామర్థ్యాల ద్వారా సాధించిన అభివృద్ధి అంటూ వేరే ఏదీ లేదు. మూడవ ప్రపంచ దేశాలను సర్వనాశనం చేయడం ద్వారా మాత్రమే పాశ్చాత్య దేశాల అభివృద్ధి అనేది సాధ్యపడింది. ఇప్పుడు ఆ మూడవ ప్రపంచ దేశాల నుండే ప్రజలు వలసదారుల రూపంలో ఎక్కడికైనా పోయి తలదాచుకోడానికి నానా అగచాట్లూ పడుతున్నారు. మూడవ ప్రపంచ దేశాలు తమ తమ దేశాల్లో అభివృద్ధి మార్గాన ముందుకు సాగి తద్వారా ఈ వలసలను నియంత్రించడానికి చేస్తున్న ప్రయత్నాలను సైతం దెబ్బ తీయడానికి సామ్రాజ్యవాద దేశాలు ప్రయత్నిస్తున్నాయి. అందుకోసం అవసరమైతే సైనికపరంగా కూడా జోక్యం చేసుకోడా నికి తయారౌతున్నాయి. నేను చేస్తున్న ఈ వాదనను అతిశయో క్తులుగా పరిగణించి కొందరు కొట్టివేయవచ్చు. అటువంటివారు చేస్తున్న వాదనలు ఇలా ఉన్నాయి: 'పాశ్చాత్య దేశాల్లో గణనీయమై న సాంకేతిక మార్పులు ప్రవేశపెట్టబడ్డాయి. వాటి ద్వారా చాలా అద్భుతంగా శ్రామిక ఉత్పాదకత పెరిగింది. తద్వారా పశ్చిమ దేశాల్లో నిజవేతనాలు, నిజ ఆదాయాలు బాగా పెరిగాయి. సామ్రాజ్యవాద దేశాల్లో ఉన్నది, మూడవ ప్రపంచ దేశాల్లో కనిపించనిది ఈ కొత్త కొత్త పరిశోధనలే. ఆ సాంకేతిక పురోగతిఅన్నదే పశ్చిమ దేశాలను మూడవ ప్రపంచ దేశాల కంటే భిన్నంగా నిలబెట్టింది. వాటి ఆర్థిక గమన దిశలో పూర్తి తేడా అన్నది దానివల్లే తలెత్తింది. దాని వల్లే ఆమూడవ ప్రపంచ దేశాల నుండి వలసదారులు వేరే వేరే ప్రాంతాలకు వలసలు పోతున్నారు.'అయితే ఇక్కడ నూతన పరిశోధనల విషయంలో రెండు అంశాలను చెప్పాలి. ఏదైనా ఒక కొత్త సరుకుకు సంబంధించిన పరిశోధనను ఉత్పత్తి రంగంలో ఉపయోగించాలంటే అటువంటి సరుకుకు సంబంధించిన మార్కెట్ విస్తరించే పరిస్థితి ఉండాలి. అందువల్లే ఆర్థిక మాంద్యంలో చిక్కుకున్నప్పుడు కొత్త పరిశోధనలను ఉత్పత్తి రంగంలో ప్రవేశపెట్టరు. రెండవది: కొత్త ఆవిష్కరణలు వాటంతట అవే నిజవేతనాలను పెంచడానికి దోహదం చేయలేవు. అప్పటికి లేబర్ మార్కెట్‌లో కార్మికులు తగినంత సంఖ్యలో లభ్యం కానిపరిస్థితులు ఉన్నప్పుడే కొత్త ఆవిష్కరణలు నిజవేతనాల పెంపుకు తోడ్పడగలవు. మూడవ ప్రపంచ దేశాల మార్కెట్లను సామ్రాజ్యవాదులు చేజిక్కించు కున్న కారణంగా చరిత్రలో దీర్ఘకాలం పాటుపాశ్చాత్య దేశాల ఉత్పత్తుల మార్కెట్ విస్తరిస్తుంద న్న అంచనాలు కొనసాగాయి. బ్రిటన్‌లో మొదలైన పారిశ్రామిక విప్లవం పారిశ్రామిక పెట్టుబడిదారీ యుగానికి నాంది పలికింది. అక్కడ యంత్రాల ద్వారా తయారైన సరుకులకు మార్కెట్‌ను కల్పించడం మూడవ ప్రపంచ దేశాల చేతివృత్తుల మార్కెట్‌ను దెబ్బ తీయడం ద్వారా మాత్రమే సాధ్యపడింది. పశ్చిమ దేశాలలో వచ్చిన కొత్త ఆవిష్కరణలకు రెండో పార్శ్వంలో మూడవ ప్రపంచ దేశాల స్థానిక మార్కెట్ల వినాశనం కనిపిస్తుంది. దానితోబాటు పెద్ద ఎత్తున అక్కడ రిజర్వు శ్రామికులు (ఉపాధి కోల్పోయినవారు) తయారయ్యారు. సాంకేతిక పురోగతి కారణంగా నూతన ఆవిష్కర ణలు ప్రవేశపెట్టిన దేశాల్లో సైతం రిజర్వు శ్రామికులు తయార య్యారు. అయితే,పశ్చిమ యూరప్ నుండి పెద్ద సంఖ్యలో శ్రామి కులు కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా తదితర సమశీతోష్ణ మండల దేశాలకు వలసలు పోయారు. ఇలా వలసలు పోయినవారు ఆకొత్త ప్రాంతాల్లో నివసిస్తున్న స్థానిక తెగల ప్రజలను పెద్దఎత్తున ఊచకోత కోశారు. వారిని అక్కడి నుండి వెళ్ళగొట్టారు. వారి భూములను ఆక్రమించుకుని అక్కడసాగు చేయడం ప్రారంభించారు. ఈభారీవలసల కారణంగా, ఏ దేశాల్లోనైతే కొత్త ఆవిష్కరణలు ఉత్పత్తిలో ప్రవేశపెట్టారో అక్కడ లేబర్ మార్కెట్‌లో కొంతవరకు కొరత కనిపించింది. అందువలన ఒకమేరకు నిజవేతనాల్లో పెరుగుదల వచ్చింది. కొత్త ఆవిష్కరణలు ఆ ప్రత్యేక పరిస్థితుల్లో ఉత్పాదకత పెరగడానికి, అదే సమయంలో నిజవేతనాలు పెరగడానికి దారి తీశాయి. కాని మూడవ ప్రపంచ దేశాల్లో పెరిగిన రిజర్వు శ్రామికులు యూరప్ కార్మికుల మాదిరిగా ఆ సమశీతోష్ణ మండల దేశాలకు వలసలు పోవడం సాధ్యపడలేదు.వాళ్ళు ప్రధానంగా ఉష్ణ మండల ప్రదేశాలకు మాత్రమే పరిమితం అయ్యారు. అక్కడ వేతనాల స్థాయి చాలా తక్కువగా ఉంటుంది.పైగా వలసలపై చాలా ఆంక్షలు కూడాఉంటాయి. నేటికీ అదే పరిస్థితి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పశ్చిమ యూరప్ దేశాల నుండి ఆ దేశాలకు పెట్టుబడిదారులు గనుక తరలివెళ్ళి అక్కడి తక్కువ వేతనాల స్థాయిని ఉపయోగించుకుని తమ వద్దనున్న కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడి ప్రపంచ మార్కెట్‌కు సరుకులను అందించివుంటే అప్పుడు పశ్చిమ దేశాలకు, మూడవ ప్రపంచ దేశాలకు మధ్య వేతనాల్లోని వ్యత్యాసాలు అంతరించి వుండేవి. కాని సమశీతోష్ణ మండల దేశాల నుండి పెట్టుబడి ఉష్ణమండల దేశాలకు ఆ విధంగా తరలిరాలేదు. కేవలం పరిశ్రమలకు కావలసిన ముడిసరుకుల ఉత్పత్తి రంగాలకు మాత్రమే వచ్చింది.

- కొక్కు రవికుమార్

# 15లక్షల కోట్ల అప్పుల్లో తెలుగు రాష్ట్రాలు..!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి కొత్తంగా రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడి దాదాపు పుష్కరకాలం కావస్తోంది. రెండు రాష్ట్రాల్లో ఇద్దరు సిఎంలు, కొన్ని పొలిటికల్ పదవులు, డిజిపిలు, సిఎస్‌లు ఏర్పడ్డా ఈ రెండు రాష్ట్రాల్లో సాధించిన అభివృద్ధి శూన్యం. ఉమ్మడి ఏపిగా ఉన్ననాటికి నేటికి..సాధించిన అభివృద్ధి ఏదయినా ఉందంటే అది అప్పులు మాత్రమే. రాజకీయ నేతలకు పాలన చేతగాకపోవడం వల్ల రెండు తెలుగు రాష్ట్రాలు దాదాపు 15లక్షల కోట్ల అప్పుల్లో మునిగిపోయాయి. ఈ అప్పులు ఏ అభివృద్ధికి తార్కాణమో పాలకులు చెప్పాలి. దీనికి ఎవరు బాధ్యులో చెప్పాలి. ఉచిత పథకాలతో రాష్ట్రాలను దివాళా తీయిస్తున్న పాలకుల తీరు వల్ల రాష్ట్రాలు ఎప్పటికీ అభివృద్ధి చెందవు. ప్రజలు కడుతున్న విలువైన ట్యాక్స్ మొత్తాలను ఇలా దుబారా చేయడం ఎంతవరకు న్యాయమో ప్రజలే ఆలోచన చేయాలి. ఎంతకాలమిా ఉచిత పథకాలు ఇస్తారో చెప్పాలి. దీనిని ఏ రకమైన అభివృద్ధి అంటామో కూడా తెలపాలి. ఎందుకంటే రోడ్లు వేయడానికి నిధులు లేవు. అభివృద్ధి పనులకు నిధులు లేవు. సకాలంలో జీతాలు, పెన్షన్లకు నిధులు లేవు. స్కూళ్లు, వైద్యశాలలు కునారిల్లుతున్నాయి. పన్నులు మాత్రం దండిగా వసూలు చేస్తున్నారు. దక్షుడు లేని ఇంటికి పదార్థ వే లక్షలు వచ్చినా..అన్న శతకకారుడి పద్యం ఇప్పుడు ఈ రెండు తెలుగు రాష్ట్రాలకు బాగా సరిపోతుంది. కిలో రూపాయికే బియ్యం, పెన్షన్లు, ఉచితబస్సు, ఉచిత విద్యుత, ఉచిత సిలిండర్, ఉచితంగా ఇళ్లు..ఇలా ఇంచుమించుగా ఇలాంటి పథకాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో అమలవుతున్నాయి. ఇదే అభివృద్ధిగా చెబుతూ గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. పెన్షన్లు పంచడానికి ఏపిలో సిఎం చంద్రబాబు హెలికాప్టర్ వేసుకుని తిరుగుతున్నారు. ఇంతదండగ మారి ఖర్చు ఎందుకో బాబు చెప్పాలి. హెలికాప్టర్ ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. ఇక తెలంగాణలో పదేళ్ల కేసిఆర్ పాలన అప్పుల కుప్పగా నిలిచింది.

వాటిని సరిచేసుకుని అభివృద్ధి చేసుకుంటూ పోవాల్సిన రేవంత్ సర్కార్ కూడా ఉచిత పథకాలను రద్దు చేయలేకపోతున్నది. ఓట్లు పోతాయన్న భయంతో ఈ పథకాలు కొనసాగిస్తున్నారు. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడమే పెద్ద దగా అనుకుంటే ..సన్నబియ్యం ఇవ్వడం పెద్ద సంస్కరణగా చెప్పుకుంటు న్నారు. ఇక దీనిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఇటీవల కేంద్రానికి సిఎం రేవంత్ సూచించారు. ఇలాంటి పథకాలు ప్రజలు సోమరులై, ఇళ్లల్ఓ కూర్చుని పనులకు పోకుండా ఉంటున్నారు. గ్రామాల్లో లేబర్ కావాలన్నా దొరకడం లేదు. వ్యవసాయానికి కూలీలు దొరకడం లేదు. ఇవన్నీ తెలిసిన విషయాలే అయినా ఎ వ్వరూ పెద్దగా చర్చించడం లేదు. ఇకపోతే రాష్ట్ర అభివృద్ధి, భవిష్య త్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను రూపొం దిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా, ఈ విజన్ పాలసీ లక్ష్యాలు, ప్రణాళికలపై చర్చిస్తున్నారు. నిజానికి మిగులు ఆదాయం లేకుండా, అప్పులను ఎలా తీర్చాలో తెలప కుండా, ఉచిత పథకాల నుంచి గట్టెక్కడం ఎలాగో చెప్పకుండా తెలంగాణను 2037 వరకు1ట్రిలియన్ ఎకానమిాగామారుస్తామని ప్రకటించడం దారుణం. అంతేనాఅంటే ప్రజలను మభ్య పెట్టడం తప్ప మరోటి కాదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సిఎంలు ఇద్దరూ అప్పులను తీర్చేందుకు ఉపాయాలు కోరడం లేదు. అప్పుల ఊబినుంచి బయటపడే ప్రయత్నం చేయడం లేదు.

# రోడ్లపైనే ధాన్యం.. రైతు దైన్యం!

## - అందుబాటులోలేని డ్రయర్ మిల్లులు



కృష్ణా: రైతులకు అండగా ఉంటామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయి. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తే ఈవిషయం తేటతెల్లమవు తుంది. తాజాగా దిత్వా తుపాను ప్రభావంతో వాతావరణంలో చోటుచేసు కున్న మార్పులు రైతులకు శాపంగా మారాయి. రోజువారీ యంత్రాలతో నూర్చిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించే పరిస్థితి లేకుండా పోయింది. చిరుజల్లులు పడుతుండటంతో ధాన్యం ఆరబెట్టడానికి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తుపానును ఆసరాగా చేసుకుని కొందరుమిల్లర్లు, దళారులు ధాన్యం ధరలో కోత పెట్టి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. కృష్ణా జిల్లా మొవ్వ మండలం అవిరిపూడి నుంచి కూచిపూడి, బందరు, నిమ్మకూరు, పాలంకిపాడు వెళ్లే రోడ్లన్నీ ధాన్యంతో నిండిపోయాయి. నవంబర్ 30నాటికి జిల్లాలో 24,137 ఎకరాల్లో వరి నూర్పిడి పూర్తి చేశారు. 1,62,068 టన్నుల ధాన్యం సేకరించారు. మరో2,30, 686. 842 టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంది. రోజువారీ నూర్పిడి సామర్థ్యానికి తగిన డ్రయర్ మిల్లులు లేకపోవడంతో నూర్చిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించే పరిస్థితి లేకుండా పోతోంది. 75 డ్రయర్ మిల్లుల్లో రోజువారీ ఎనిమిది వేల టన్నులు మిల్లింగ్ చేసే సామర్థ్యం మాత్రమే ఉంది. దీంతో రోజువారీ ఏడువేల టన్నుల ధాన్యం రోడ్లపై ఉండిపోతోంది. వాతావరణ మార్పులతో నూర్చిన ధాన్యం వెంటనే ఆరబెట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని, నాణ్యతలో కొద్దిపాటి తేడావచ్చినా రైస్ మిల్లర్లు కొనుగోలు చేయరనిరైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. ధరలో కోత: మొవ్వ మండలం అవిరిపూడికి చెందిన కౌలుసు వెంకటప్పయ్య పది ఎకరాలు కౌలుకు తీసుకుని ఎంటియు 1318 రకం వరిసాగు చేశారు. నవంబరు 24న ఐదు ఎకరాలు యంత్రాలతో నూర్పిడి చేశారు. తేమశాతం చూడకుండా పచ్చి ధాన్యం 75 కిలోల బస్తా 1475 రూపాయలకు కమీషన్ వ్యాపారికి విక్రయించారు. మరో ఐదు ఎకరాల్లో ధాన్యం ఆరబెట్టారు. రైతు సేవా కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకెళితే మిల్లు వద్దకు పంపారు. అయితే మానుగాయ ఉందని సాకులు చెప్పికొనడానికి నిరాకరించారు. ఈ గ్రామానికి చెందిన మరో రైతుకారుమూరి రామకృష్ణ(నాని) ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేశారు. నాలుగు ఎకరాల్లో వచ్చిన ధాన్యం దిగుడిని బస్తా 1500 రూపాయలకు విక్రయించారు. తుపాను నేపథ్యంలో మిగతా నాలుగు ఎకరాల్లోని దిగుబడిని బస్తా రూ.1300 అడుగుతున్నారు. బంటుమిల్లి మండలం అర్తమూరు గ్రామానికి చెందిన కాగిత వెంకట్రావు ఒక ఎకరాలో స్వర్ణ రకం వరి పండించారు. పంటను యంత్రాలతో నూర్పిడి చేసి రోడ్డుపై ఆరబెట్టారు.ధాన్యం రంగుమారిందని చెబుతూ మిల్లర్లు కొనడానికి నిరాకరిస్తున్నారని రైతు వాపోతున్నారు. ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలోతేమ శాతం ఆధారంగా ధర నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ రైస్ మిల్లుయజ మానితో రైతులు వాదనకు దిగడం రైతు సేవా కేంద్రాల వైఫల్యాలను ఈ ఘటనలు ఎత్తిచూ పుతున్నాయి.

# 50 రోజుల్లో 2వేల మంత్రాల పఠనం

## కాశీ కుర్రాడు వేదమూర్తికి మోడీ ప్రశంసలు

న్యూఢిల్లీ: 19 ఏళ్ల పండితుడు వేదమూర్తి దేవ్రవత్ మహేశ్ రేఖీపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. దండక్రమ పారాయణాన్ని పూర్తి చేసిన క్రమంలో ఆ కుర్రాడిని ప్రధాని మెచ్చుకున్నారు.

శుక్ల యజుర్వేదంలోని మధ్యాంధినిలో ఉన్న సుమారు 2000 మంత్రాలను ఆ యువకుడు పారాయణం చేశారు. వరుసగా 50 రోజుల్లో ఆ మంత్రాలను అతను వల్లించాడు. ఇదో గొప్ప ఘనత అని ప్రధాని మోదీ తన ప్రశంసలో పేర్కొన్నారు.

రాబోయేతరాలు ఈఅద్భుత ఘనతను గుర్తుంచుకుంటాయని అన్నారు. భారతీయ సంస్కృతి పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఆ కుర్రాడు సాధించిన ఘనతను గర్విస్తారన్నారు. ఎటువంటి అవరోధాలు లేకుండా శుక్ల యుజుర్వేదంలోని 2వేలమంత్రాలను ఆ యువకుడుపఠించినట్లు చెప్పారు.కాశీ నియోజకవర్గానికి చెందినఆ కుర్రాడుఆ పవిత్ర పట్టణంలో అసాధారణఫీట్‌ను సాధించడం పట్ల సంతోషంగాఉందని ప్రధాని అన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో మోదీ మెసేజ్ చేశారు.

ఆకుర్రాడికి సపోర్టు ఇచ్చిన కుటుంబసభ్యులకు, పండితులుకు, సంస్థలకు ప్రధాని థ్యాంక్స్ తెలిపారు. మరో వైపు హర్యానాలోని జాజర్‌లో ఉన్న సిద్ధ బాబా పాల్‌నాథ్‌ఆశ్రమాన్ని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. ప్రాణ ప్రతిష్ట, ఆత్మ భండార కార్యక్రమా ల్లో ఆయన పాల్గొన్నారు. సనాతన సంస్కృతి, మానవ పరిణామ క్రమంలో దాని ప్రభావాన్ని ఆయన తన ప్రసంగంలో తెలిపారు.

# హాంకాంగ్ ఘటన నుంచైనా గుణపాఠాలు నేరుస్తారా

హైదరాబాద్ విశ్వనగరంలా అభివృద్ధి చెందుతున్నది. నగరం నలువైపులా విస్తరిస్తున్నది. ఎటూ చూసినా బహుళ అంతస్తులే వెలుస్తున్నాయి. ఆకాశమే హద్దుగా యేడాదికి ఏడాది అంతస్తులు పెరుగుతున్నాయి. వాటి భద్రతకు భరోసా ఎక్కడుంది.. అగ్నిప్రమా దాలు సంభవిస్తే.. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే అగ్నిమాపక వ్యవస్థ ఉందా అంటే లేదనే సమాధానం వస్తోంది. అగ్నిప్రమాదాన్ని నియంత్రించే పరికరాలు అందుబాటులో ఉన్నాయా అంటే..అవేమీ లేవంటున్నారు. ఇటీవల హాంకాంగ్‌లో జరిగిన అగ్ని ప్రమాదాలు వస్తే ప్రాణాలకు భద్రత ఏదని బహుళ అంతస్తుల్లో నివసిస్తున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం అ నుకోకుండా వచ్చేది అలాంటి ప్రమాదాలను ఎదుర్కొవడానికి కావాల్సిన పరికాలు, యంత్రాలు ప్రభుత్వం దగ్గర సిద్ధంగా ఉండాలి.. కాని మన తెలంగాణ ప్రభుత్వం మాత్రం అలాంటి ఆలోచనే చేయడం లేదు.. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రధాన నగరాల్లో తరుచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ ఆస్తి నష్టంతోపాటు ప్రాణ నష్టం కూడా జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల హాంకాంగ్‌లో 30 బహుళ అంతస్తుల సముదాయంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో వందల సంఖ్యలో మరణాలు చోటు చేసుకున్నాయి. అలాంటి ఘటనల నుంచి కండ్లు తెరవాల్సిన అవసరముంది. హైదరాబాద్‌లో 18 అంతస్తుల భవనాల్లో ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగిందంటే నివారించేందుకు కావాల్సిన యంత్రాలు మన అగ్నిమాపక శాఖ దగ్గర లేవు.అంటే18 అంతస్తులపైన ప్రమాదం జరిగిందంటే ప్రభుత్వం చేతులెత్తేసే పరిస్థితి. హైదరాబాద్ మహానగరం విశ్వనగరంలా అభివృద్ధి చెం దుతూ నలువైపులా విస్తరిస్తున్నది. ఎటూ చూసినా బహుళ అంతస్తులే వెలుస్తున్నాయి. 63 అంతస్తుల వరకు అపార్ట్‌మెంట్ నిర్మాణాలకు హెచ్‌ఎండీఏ అనుమతులు ఇవ్వడంతో ఆకాశమే హద్దుగా యేడాదికి ఏడాది అంతస్తులు పెరుగుతున్నాయి.

ఇలా బహుళ అంతస్తుల భవనాలు పెరుగుతున్నా, వాటి భద్రతకు భరోసా ఎక్కడుంది.. ఊహించని అగ్నిప్రమాదాలు సంభవిస్తే, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే వ్యవస్థ అగ్నిమాపక శాఖ వద్ద ఉందా అంటే లేదనే సమాధానం వస్తోంది. 18 అంతస్తులకుపైన ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే అక్కడ మంటలను ఎలా ఆర్పేస్తారు, అక్కడ చిక్కుకున్న వారిని ఎలా రక్షిస్తారు, పరికరాలను సమకూర్చాల్సిన అవసరం ఉంది. ఇతర రాష్ట్రాలు, దేశాలు ఏ విధంగా పరికరాలను సమకూర్చు కుంటున్నాయో పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. బ్రోంటో స్కై లిఫ్టులు రెండు అగ్నిమాపక శాఖ వద్ద ఉండగా, ఇవి 54 మీటర్ల ఎత్తు వరకు (18 ఫ్లోర్ల వరకు), ఒక ఇంపోర్టెడ్ రిస్క్యూ టెండర్ , రిస్క్యూ రెండర్స్ 4, ఒక హజ్మత్ వాహనం, ఒక డీసీపీ టెండర్స్, ఒక స్నోర్కెల్, మల్టీపర్పస్ టెండర్లు 68, అడ్వాన్స్ వాటర్ టెండర్లు 9, వాటర్ కమ్ ఫోమ్ టెండర్లు 9,160 వాటర్ టెండర్లు, 18 మినీ వాటర్ టెండర్లు, 21 వాటర్ బ్రౌజర్లు, ఐదు వాటర్ లారీలు, 29 మిస్ట్ జీప్ ఇలా ప్రమాదాలను నిలువరించేందుకు ఉపయోగించే వాహనాలు అగ్ని మాపక శాఖ వద్ద 827 ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.



## శక్కర్ నగర్ శ్రీరామ మందిరంలో శ్రీరాముల వారికిపట్టు వస్త్రాలు,రూ:25 వేల నగదు సమర్పించిన కల్వ కుంట్ల కవిత

బోధన్ ప్రతినిధి,మార్చి 27: (ప్రజా గళం) నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ లో గల శ్రీరామ మందిరంలో భక్తి శ్రద్ధలతో శ్రీరామ నవ మి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ వేడుకలో బాగంగా ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తరుపున పట్టు వస్త్రాలు,25000/-రూపాయలు నగదు,తలంబ్రాలు రాములవారికి సమర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి బోధన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు గట్టు హరికృష్ణ పట్టు వస్త్రాలు, 25000/- రూపాయలు నగదు,తలంబ్రాలు రాముల వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణా సీని యర్ జాగృతి నాయకులు గట్టు హరికృష్ణ,అంబం(వై) గ్రామ సర్పంచ్ గోపరి స్రవంతి సుమన్,రంజిత్, కట్టర్ శ్రీకాంత్, వీరేశం,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్,డీజిల్ కొరతపై పుకార్లని నమ్మవద్దు..

### బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ వెల్లడి.... ఎవరైనా ఫేక్ వార్తలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు... సిఐ హెచ్చరిక....




బోధన్ ప్రతినిధి,మార్చి 27:(ప్రజా గళం): బోధన్ పట్టణంలో పెట్రోల్,డీజిల్ కొరత ఉందన్న వార్త లను నమ్మవద్దని పట్టణ సీఐ వెంకటనారాయణ స్పష్టం చేశారు. పెట్రోల్ బంకుల వద్ద గుంపులుగా చేరి ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించవద్దని కోరారు.బ్యారెల్స్ లో పరి మితికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు.అనవసరంగా భయాందోళన లకు గురికావద్దని,ఇంధనం సరిపడా అందుబాటులో ఉందని ఆయన స్పష్టం చేశారు.ఎవరైనా ఫేక్ వార్తలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

## SRNK పీజీ కళాశాలలో హెల్త్ క్యాంపు నిర్వహణ..




బాన్సువాడ, మార్చి 28,ప్రజాగళం.బాన్సువాడ పట్టణంలోని నా=చీఖ ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీకళాశాల(అటానమస్)లో జంతుశాస్త్ర విభాగం ఆధ్వ ర్యంలో శనివారం హెల్త్ క్యాంపు కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించారు.కార్యక్రమానికి బాన్సువాడకు చెందిన ప్రముఖ చర్మవ్యాధి మరియు కాస్మోటాలజీ నిపుణులు డాక్టర్ సౌజన్య గోలే, సాధారణ వైద్య నిపు ణులు (వీడీడీూ, వీణ) డాక్టర్ సాయిలు మన్నె ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందూరు గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యే క శ్రద్ధ పెట్టాలని సూచించారు. హెల్త్ క్యాంపుల ద్వారా వైద్యు ల సూచనలు తీసుకుని, ఎక్కువగా నీళ్ల త్రాగడం, పుష్టికర ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు.డాక్టర్ సాయిలు మన్నె మాట్లాడుతూ నేటి ఫాస్ట్ ఫుడ్ సంస్కృతిలో జంక్ ఫుడ్ మరియు ప్లాస్టిక్ విని యోగం పెరగడం వల్ల క్యాన్స ర్ వంటి తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల వీటిని పూర్తిగా నివారిం చాలని సూచించారు.డాక్టర్ సౌజన్య గోలే మాట్లాడుతూ అధికంగా కాస్మోటిక్స్ వాడకం వల్ల ముఖ్యంగా విద్యార్థినులకు చర్మ సమస్యలు వచ్చే అవ కాశం ఉందని తెలిపారు. వేసవి కాలంలో సన్‌స్క్రీన్ లోషన్లు ఉపయోగించడం, సరైన ఆహారం తీసుకోవడం, తగిన నిద్రపోవడం ద్వారాచర్మఆరోగ్యంకాపాడుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో అధ్యా పకులు రఫియా, కృష్ణ, పద్మ, సనా బేగం, బాలరాజ్, వినయ్ కుమార్, విఠల్, రేఖ, అనిత, రాజేష్, శ్రీనివాస్ తది తరులు పాల్గొన్నారు. 150 మంది విద్యార్థులు హెల్త్ క్యాంపులో పాల్గొని వైద్యుల సేవలను పొందారు.

## బాన్సువాడ కోర్టులో జాతీయ లోక్ అదాలత్.




బాన్సువాడ, మార్చి 28, ప్రజాగళం. బాన్సువాడ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ఫస్ట్ క్లాస్ సివిల్ జడ్జి ఎ.న్యా. భార్గవి ఆధ్వర్యంలో నిర్వహిం చారు.ఈ సందర్భంగా జడ్జి భార్గవి మాట్లాడుతూ వివిధ రకాల కేసుల్లో ఇరుక్కొని ప్రజలు సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని సూచిం చారు.రాజీద్వారాసమస్యలను పరిష్కరించుకుంటే ఇరుపక్షాలూ గెలిచినట్లేనని పేర్కొన్నారు. "రణం కంటే రాజీ నయం" అనే భావనతో ముందుకు రావాలని సూచించారు.కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ టీ. గోపాల్, న్యాయవాదులు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# దేశీయ పరిశ్రమ విలవిల.. వృద్ధికి దూరమైన ఉత్పత్తి..



### ఏడాది కనిష్ఠానికి ఐఐపీ సూచీ
### 0.4 శాతానికే పరిమితం
### విద్యుత్తు, గనులు, తయారీ రంగాలు పేలవం

న్యూఢిల్లీ: దేశంలో పారిశ్రామికోత్పత్తి పడకేసింది. వృద్ధికి దూరమైన పరిశ్రమ.. ఎక్కడిదక్కడే అన్నట్టు తయారైంది. అక్టోబర్‌లో ఏకంగా ఏడాదికిపైగా కనిష్ఠానికి ఉత్పాదకత దిగజారింది. ఐఐపీ గ్రోత్ రేటు0.4శాతానికే పరిమితమైంది. దేశీయ పారిశ్రామికోత్పత్తి నీ రసించిపోయింది. కీలక రంగాల్లో ఉత్పాదకత ఎక్కడిదక్కడే అన్నట్టు తయారైంది. విడుదలైన కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాల్లో పారిశ్రామికోత్పత్తి సూచీ ఏడాదికిపైగా కనిష్ఠాన్ని తాకుతూ 0.4 శాతం వృద్ధికే పరిమితమైంది. విద్యుత్తు, గనులు, తయారీ రంగాల పేలవ ప్రదర్శనతో గత ఏడాది సెప్టెంబర్ నాటి స్థాయికి క్షీణించింది. గతంతో పోల్చితే నాడు వృద్ధి శూన్యంగా నమోదైంది. మళ్లీ ఆ స్థాయిలో ఐఐపీ గణాంకాలు ఇవే కావడం గమనార్హం. ఇక నిరుడు అక్టోబర్‌లో ఐఐపీ వృద్ధి 3.7 శాతంగా ఉన్నట్టు జాతీయ గణాంకాల కార్యాలయం తమ తాజా వివరాల్లో పేర్కొన్నది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో 4.6 శాతమని వెల్లడించింది.

రంగాలవారీగా..:తయారీ రంగ వృద్ధిరేటు ఈ అక్టోబర్‌లో 1.8 శాతానికి పడిపోయింది. నిరుడు అక్టోబర్‌లో 4.4 శాతంగా ఉన్నది. గనుల రంగంలోనైతే వృద్ధిరేటు మైనస్ 1.8 శాతంగా నమోదైంది. పోయినసారి వృద్ధి 0.9 శాతంగానైనా ఉన్నది. ఇక విద్యుదుత్పత్తి గ్రోత్ ఏకంగా మైనస్ 6.9 శాతంగా ఉండటం గమనార్హం. గత ఏడాది ఇదే నెలలో 2 శాతం వృద్ధిని కనబర్చింది. దీంతో మొత్తంగా అక్టోబర్ నెలలో ఐఐపీ వృద్ధిరేటు నిరాశపర్చింది. అలాగే క్యాపిటల్ గూడ్స్‌లోలో వృద్ధిరేటు 2.9 శాతం నుంచి 2.4శాతానికి పడిపోవడం కూడా దెబ్బతీసింది. అంతేగాక కన్స్యూమర్ డ్యూరబుల్స్‌లో వృద్ధి మైనస్ 0.5 శాతానికి పతనమైంది. నిరుడు అక్టోబర్‌లో 5.5 శాతంవృద్ధి నమోదవడం విశేషం. కన్స్యూమర్ నాన్-డ్యూరబుల్స్ ఉత్పత్తి కూడా మైనస్ 4.4 శాతంలోకి పడిపోయింది. మునుపు 2.8 శాతం వృద్ధి ఉన్నది. ప్రైమరీ గూడ్స్‌లోనూఉత్పాదకత గతంతో చూస్తే 2.5 శాతం వృద్ధి నుంచి మైనస్ 0.6 శాతానికి దిరింది. ఈ క్రమంలోనే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్/కన్‌స్ట్రక్షన్ గూడ్స్‌లో వృద్ధిరేటు ఈసారి 7.1 శాతానికి పెరిగినా ఫలితం లేకపోయింది. నిరుడు అక్టోబర్‌లో ఇది 4.7 శాతంగానే ఉన్నది. ఇంటర్మీడియెట్ గూడ్స్ సెగ్మెంట్‌లో వృద్ధిరేటు 0.9 శాతంగా నమోదైంది. పోయిన ఏడాది అక్టోబర్‌లో 4.8 శాతంగా ఉన్నట్టు ఎన్ఎస్‌వో చెప్పింది.

**ఏప్రిల్-అక్టోబర్‌లో..:** ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి 7 నెలల్లో (ఏప్రిల్-అక్టోబర్) దేశీయ పారిశ్రామికోత్పత్తి వృద్ధిరేటు 2.7 శాతానికి దిగజారినట్టు ఎన్ఎస్‌వో తెలియజేసింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఇదే వ్యవధిలో 4 శాతంగా ఉండటం గమనార్హం. ఇక తయారీ రంగంలో 23 ఇండస్ట్రీ గ్రూపులుంటే.. అందులో 9 మాత్రమే గతేడాది అక్టోబర్‌తో పోల్చితే ఈ ఏడాది అక్టోబర్‌లో వృద్ధిని ప్రదర్శించాయి. మిగతా 14 రంగాలు ఉత్పత్తిపరంగా వృద్ధికి దూరంగానే ఉన్నట్టు తేలింది.

ఆందోళనకరంగా ప్రగతి: దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రగతి ఆందోళనకరంగా తయారైంది. కీలకమైన పారిశ్రామిక రంగంలో ఉత్పాదకత క్షీణత.. దేశంలో తగ్గిన వినియోగదారుల కొనుగోలు సామర్థ్యం, మార్కెట్‌లో పడిపోయిన డిమాండ్‌ను ప్రతిబింబిస్తున్నదని మెజారిటీ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారిప్పుడు. ఇక ఈ ఉత్పత్తి పతనం నిరుద్యోగానికి దారితీస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. నిజానికి పరిశ్రమకు పెట్టుబడులు, రుణ లభ్యత, ప్రభుత్వ ప్రోత్సాహకాలు కరువైపోయాయని గుర్తుచేస్తున్నారు. ఐఐపీ తాజా గణాంకాలే అందుకు నిదర్శనంగా వారంతా పేర్కొంటుండటం ప్రస్తుత విపత్కర పరిస్థితులకు అద్దం పడుతున్నది. ఇప్పటికే రాబో యేఆర్థిక సంవత్సరానికి (2026-27)గాను కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో పరిశ్రమలకు పన్ను రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలు అందివ్వాలని పరిశ్రమ పెద్దలు,ఆయా రంగాల ప్రతినిధులు కోరుతున్న విషయం తెలిసిందే. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఈ మేరకు పారిశ్రామిక, వ్యాపార సంఘాలు సైతం లేఖల ద్వారా సూచనల్నీ ఇస్తున్నాయి. మొత్తానికి దేశీయ పరిశ్రమలో నీరసాన్ని తాజా ఐఐపీ గణాంకాలు స్పష్టంగా చూపాయనే చెప్పవచ్చు.



## రైల్వే ప్రయాణికులకు షాకింగ్ న్యూస్..

### ఇకపై రైళ్లలో ఎంత లగేజీ పడితే అంత తీసుకెళ్లలేరు!

ప్రయాణికులకు కఠినమైన లగేజీ నిబంధనలు అమలు చేయడానికి రైల్వే శాఖ సిద్ధమవుతున్నది. ఇందుకోసం విమానాశ్రయాల తరహా విధానాన్ని అమలు చేయనున్నట్టు టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక తెలిపింది. ప్రతిపాదిత నిబంధనల ప్రకారం ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాల్లో తమ లగేజీ బరువును తనిఖీ చేయించుకోవాలి. నిర్ణీత బరువు కంటే ఎక్కువ లగేజీ కలిగి ఉన్నా లేదా నిర్ణీత బరువుకు లోబడి ఉన్నా.. భారీ సైజులో ఉన్న లగేజీకి అదనపు రుసుము లేదా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఏసీ మొదటి తరగతి ప్రయాణి కులు 70 కిలోలు, ఏసీ 2టైర్ ప్రయాణికులు 50 కిలోలు, ఏసీ 3టైర్, స్లీపర్ ప్రయాణికులు 40 కిలోలు, సాధారణ తరగతి ప్రయాణికులు 35 కిలోల వరకు లగేజీ తీసుకెళ్లేందుకు అనుమతించనున్నారు. మొదట ఉత్తర మధ్య రైల్వే జోన్‌లోని ప్రముఖ రైల్వే స్టేషన్లలో ఈ నిబంధనను అమలు చేయాలని భావిస్తున్నారు. లగేజీ బరువు తనిఖీ పూర్తయ్యాకే ప్రయాణికులను ప్లాట్‌ఫామ్ మీదకు వెళ్లేందుకు అనుమతిస్తారు. మరోవైపు ఆదాయం, ప్రయాణికుల సౌకర్యం కోసం ఆధునీకరించిన స్టేషన్లలో దుస్తులు, చెప్పులు, ఎలక్ట్రానిక్స్, ప్రయాణ ఉపకరణాలు అమ్మే ప్రీమియం సింగిల్-బ్రాండ్ స్టోర్లను ప్రారంభించాలని రైల్వే శాఖ యోచిస్తున్నది.

## హిల్ట్ పాలసీపై బిఆర్ఎస్ పోరుబాట..!

హైదరాబాద్: గ్రేటర్ పరిధిలోని రూ.5లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ హిల్ట్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేం దుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందు లో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన నిజనిర్ధారణ బృందాలను నియమించారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశర చేశారు.ఈ సందర్భం గా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన కోసం, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు.సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు, కేవలం ఎస్ఆర్ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి,సుమారు రూ.5లక్షల కోట్ల ప్రజాధనాన్నికొల్లగొట్టే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవని చెబుతున్న ప్రభుత్వం, వేల కోట్లవిలువైన భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నదని మండిపడ్డారు.ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను 8 క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు పర్యటించనున్నాయి. అక్కడ స్థానిక నాయకులను, ప్రజలను కలుపుకొని వాస్తవ మార్కెట్ విలువకు,ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచనున్నారు. వీటితో పాటు అక్కడి పారిశ్రామిక వాడల ద్వారాప్రజాఉపయోగ కార్యక్రమాలు ఏమేమి చేయవచ్చు, అక్కడి స్థానిక ప్రజల సుదీర్ఘకాలం డిమాండ్లను ఆకాంక్షలను కూడా పార్టీ నేతలు తెలుసుకోనున్నారు. ఒకప్పుడు అక్కడ పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం ప్రజలు భూములు ఇచ్చిన తీరును ప్రభుత్వం కేటాయించిన తీరును వాటిని అత్యంత చవకగా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాలు కట్టబెట్టిన అంశాన్ని, వాటి ఉద్దేశాలను పార్టీ నేతల బృందాలు ప్రస్తావించనున్నాయి.డిసెంబర్ 3, 4 తేదీల్లో హిల్ట్ పాలసీ స్కామ్‌పై నిజనిర్ధారణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఎనిమిది బృందాలు ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నాయి. ఇందులో భాగంగా..క్లస్టర్-1లో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నేతృత్వంలో మాజీమంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మెదక్ ఎమ్మెల్యేల బృందం పాశమైలారం, పటాన్ చెరువు, రామచంద్రాపురం ప్రాంతాలను సందర్శించనున్నారు.క్లస్టర్-2లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నేతృత్వంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి, ఉప్పల్ నాయకులు కలిసి నాచారం, మల్లాపూర్, ఉప్పల్, చర్లపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారు. క్లస్టర్-3లో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి నేతృత్వంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుతో కూడిన బృందం మౌలాలి, కుషాయిగూడ పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తారు. క్లస్టర్-4లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానం దతో కలిసి జీడిమెట్ల, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు. క్లస్టర్-5లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్,ఎమ్మెల్సీ నవీన్ రావు సనత్ నగర్, బాలానగర్ ఏరియా లను పరిశీలిస్తారు.క్లస్టర్-6లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మేడ్చల్ ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్తారు.క్లస్ట ర్-7లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, స్వామి గౌడ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి,పటోళ్ల కార్తిక్ రెడ్డి..కాటేదాన్, హయత్‌నగ ర్‌లో పర్యటిస్తారు. క్లస్టర్-8లో మాజీ మంత్రి మహ్మూద్ అలీ,ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, చందులాల్‌తో కూడిన బృందం బారాదరి పారిశ్రామిక వాడను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తారు.

## డిజిటల్ విద్యాభోధనకు ఆర్థిక సాయం

గుంటూరు : భిన్న ప్రతిభావంతులు, దివ్యాంగుల కోసం ఏపీ సమగ్రశిక్షా అభియాన్ కీలక చర్యలు తీసుకుంటోంది. విభిన్న ప్రతిభావం తులకు డిజిటల్ విద్యా బోధనతో పాటుగా వారికి ఆర్థికంగా చేయూత అందిస్తున్నారు. సర్వే ద్వారా విభిన్న ప్రతిభావంతులను గుర్తించి స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చుతున్నారు. అనంతరం స్కూలుకు వచ్చేందుకు రవాణా భత్యం చెల్లిస్తున్నారు. సహాయకులను ఏర్పాటు చేసుకుంటే సహాయకులకు కూడా భత్యం చెల్లిస్తున్నారు.దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతూ ఉంటాయి. వారిసాధికారత కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తుంటాయి. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విభిన్న ప్రతిభావంతుల కోసం ఏపీ సమగ్ర శిక్షా అభియాన్ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. వారికి చదువు నేర్పడంతో పాటు భవిష్యత్తుకు బాటలు వేసేలా కీలక చర్యలు తీసుకుంటోంది. విభిన్న ప్రతిభావంతులను సాధారణ పాఠశాలల్లో చేర్పించడంతో పాటుగా..వారికి ట్యాబ్‌ల ద్వారా బోధన అందిస్తున్నారు. ఈ ట్యాబ్‌లో 33 రకాల యాప్‌ల సాయంతో డిజిటల్ విద్యా బోధన చేస్తోంది.అలాగే ఆటిజంతో బాధపడుతున్న చిన్నారుల కోసం దేశంలో తొలిసారిగా ఏపీలోని పట్టణాల్లో 125 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు.మరోవైపు విభిన్న ప్రతిభావంతులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నారు. సర్వేలో గుర్తించిన అనంతరం వారిని సమీపంలోని గవర్నమెంట్ స్కూళ్లల్లో నమోదు చేస్తున్నారు. అలాగే ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీలను భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. ప్రత్యేకంగా ట్రైనింగ్ తీసుకున్న ఉపాధ్యాయులతో వారికి విద్యాబోధన చేయిస్తున్నారు. ఇక స్కూలుకు కూడా రాలేని చిన్నారుల కోసం ప్రతి శనివారం ఇంటి వద్దనే బోధన చేస్తున్నారు. అలాగే దివ్యాంగులైన విద్యార్థులకు రవాణా భత్యం కింద నెలకు రూ.600అందిస్తోంది ప్రభుత్వం. బాలికలైతే మరో 200 రూపాయలు అదనంగా రవాణా భత్యం చెల్లిస్తున్నారు. సొంతంగా స్కూలుకు రాలేని దివ్యాంగ విద్యార్థులు సహాయకులను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించేందుకు సహాయకుల భత్యం కూడా అందిస్తున్నారు. అలాంటి వారికి నెలకు రూ.600 చొప్పున చెల్లిస్తున్నారు.మరోవైపు విభిన్న ప్రతిభావంతులు , ప్రత్యేక అవసరాలు గల పిల్లల చదువును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు చెప్తున్నారు. పాఠశాలల్లో వీరి ప్రవేశాలు పెంచేందుకు,ఆర్థిక చేయూత కూడా అందిస్తున్నట్లు చెప్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడిస్తున్నారు. సాధారణ పిల్లలతో పోల్చితే వీరు ఎందులోనూ తీసిపోరంటున్న అధికారులు.. ఆ నమ్మకం వారిలో కలిగించి, వారి సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్తున్నారు.

## గంజాయిపై సమరం...

**అమరావతి,:** రాష్ట్రంలో గంజాయి 'భూతం' జడలు విప్పి కరాళంగా నర్తిస్తున్నదనడానికి ప్రత్యక్ష సాక్ష్యం నెల్లూరులో పట్టపగలు యువ కళాకారుడు, సిపిఎం కార్యకర్త పెంచలయ్య దారుణ హత్య. గంజాయి, మాదక ద్రవ్యాల బారిన పడకుండా స్థానిక యువతను, ప్రజలను చైతన్యపరుస్తున్న యువ నేతను మాఫియా ముఠాలు కత్తులతో వెంబడించి చంపడం పట్ల రాష్ట్రం ఉలిక్కిపడింది. గంజాయి అక్రమ వ్యాపారాన్ని ఎదిరించి అడ్డుకోవడం సంఘ విద్రోహ ముఠాలకు కంటగింపుగా మారినందునే పెంచలయ్యను కిరాతకంగా ఒక పథకం ప్రకారం అంతమొందించారు. అఘాయిత్యానికి కారకులెవరో కొద్దిసేపట్లోనే పోలీస్ అధికారులు పూసగుచ్చినట్లు వల్లెవేశారు. ప్రధాన నిందితురాలైన మహిళా డాన్ అరవ కామాక్షి, మరికొంత మంది నిందితులను అరెస్టు చేశారు. గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, వాటికి బానిసలు కావొద్దని ప్రభుత్వాధికార్లు, పోలీసులతో కూడా కలిసి పెంచలయ్య కొన్ని ప్రత్యేక కళారూపాల ప్రదర్శనలతో ప్రచారం చేశారు కాబట్టి నిజా నిజాలు సులభంగానే పోలీసులు తెలుసుకోగలుగుతారు. పెంచలయ్య హత్యతోనే నెల్లూరులో గంజాయి బ్యాచ్ నేరాలు లోకానికి తెలిసిందనుకోవడానికి వీల్లేదు. గతంలో నెల్లూరులో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోడానికి ప్రయత్నించిన పోలీసులపై మాఫియా ముఠాలు ఎదురుదాడి చేసి ఉడాయించారు. మాఫియా దాడుల్లో పోలీసులు గాయపడ్డారు కూడా. పెంచలయ్య హత్య అనంతరం ఖాకీలు హంతకులను పట్టుకొనేందుకు వెళ్లగా పోలీసు కానిస్టేబుల్‌పై కత్తులతో దాడి చేశారు. ఆత్మరక్షణార్థం పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ వరుస ఘటనలు నెల్లూరు జిల్లాలో గంజాయి ముఠాలు ఎంతగా పెట్రేగిపోతున్నాయో కళ్లకు కడతాయి. పెంచలయ్య హత్యోదంతంలో ప్రధాన నిందితురాలి మాఫియా సామ్రాజ్యం, మాదక ద్రవ్యాల రవాణా ఒరిస్సా నుంచి కోస్తాంధ్ర మీదుగా వయా నెల్లూరును దాటుకొని చెన్నరు, బెంగళూరుకు విస్తరించి కొన్నేళ్లుగా నిరాటంకంగా సాగుతోందంటే పాలనలో ఉన్న అందరి అండ దండలూ పుష్కలంగా లభించాయని అర్థమవుతుంది. విషయం బయట పడింది కాబట్టి నేతల మధ్య పరస్పర ఆరోపణలు సాగుతున్నాయి. మాఫియా ముఠాలకు పార్టీలతో పని లేదు. ఎవరు అధికారంలో ఉంటే వారి మద్దతు తీసుకొని తమ దందా నడుపుతారు. సమాజానికి హానికరంగా తయారై ప్రజల మాన ప్రాణాలను హరించే ముఠాలతో తమ స్వార్థ ప్రయోజనాల కోసం అంటకాగకూడదన్న ఇంగితం పాలక పార్టీలకు, ప్రభుత్వాలకు అవసరం. గంజాయి సహా మత్తు పదార్థాలపై పోరాటం కొనసాగిస్తామన్న సిపిఎం ప్రతిన తతిమ్మా పార్టీలకు మార్గదర్శిగా నిలుస్తుంది. మత్తు పదార్థాల రహిత రాష్ట్రం చేసేందుకు నేరస్తులపై ఉక్కుపాదం మోపుతామని ఎన్నికల్లో టిడిపి కూటమి హామీ ఇచ్చింది. కేబినెట్ సబ్‌కమిటీ భేటీలు, ఈగల్ టీంలను నెలకొల్పింది. అయినా రాష్ట్రంలోగంజాయి రవాణా ఆగలేదనడానికి రోజూఏదొక చోట దొరుకుతున్న గంజాయి నిల్వలే నిదర్శనం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆదాయమే పరమావధిగా తెచ్చిన ఎక్సయిజ్ పాలసీలో 3,700పైన ప్రైవేటువైన్ షాపులు, వాటికి అనుబంధంగా తాగేందుకు పర్మిట్ రూంలు,విచ్చలవిడి బెల్ట్ షాపులు,చాలదన్నట్లు గంజాయి,డ్రగ్స్, మాదక ద్రవ్యాలు వగైరా. యువతను నిర్వీర్యం కావిస్తున్నాయి.

## కన్నీళ్లు తెప్పిస్తున్న రైతు ఆత్మహత్యలు..?

ఖమ్మం: వ్యవసాయం చేస్తున్న రైతులకు ఎన్నో నష్టాలు వస్తున్నాయని, అతికష్టమ్మీద పంట పండిస్తే దానికి మద్దతు ధర రాదని ఆవేదన వ్యక్తం చేస్తూ కౌలు రైతు బానోతు వీరన్న ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని, ఎక్కువ మద్దతు ధర ఇవ్వాలని, సబ్సిడీలు ఇచ్చి ఆదుకోవాలని.. తమకు ఆత్మహత్యలు తప్ప మరో మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ బానోతు వీరన్న సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. పురుగుల మందు తాగిన తరువాత తమ బాధను చెప్పుకుంటూ తీసిన సెల్ఫీ వీడియో వైరల్ అవుతోంది. రైతు ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో కౌలు రైతు బానోతు వీరన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం అన్నారు మాజీ మంత్రి హరీష్ రావు. పురుగుల మందు తాగుతూ.. పండించిన పంటకు ధర రాక, అప్పులు తీర్చే దారిలేక చనిపోతున్నానని.. మద్దతు ధర కల్పించాలని వీరన్న తీసుకున్న సెల్ఫీ వీడియో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాలకు నిదర్శనం అని విమర్శించారు.కౌలు రైతు వీరన్నది ఆత్మహత్య కాదు, ప్రభుత్వం చేసిన హత్య. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని కారణంగా ఆర్థిక తోడ్పాటు లేక, అప్పులు భారమై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎన్నిక లకు ముందు కౌలు రైతులకు ఏడాదికి రూ. 15,000 రైతుభరోసా ఇస్తామని బాండ్లు రాసిచ్చి, ఓట్లు వేశాక రైతులను మోసం చేయడం దుర్మార్గం. పండించిన పంటను కొనే దిక్కులేక, మద్దతు ధర రాక, దళారుల దోపిడీకి రాష్ట్ర వ్యాప్తంగా రైతులు బలవుతున్నారు. సెల్ఫీ వీడియోలో రైతు వీరన్న చెప్పిన మాటలకైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి చలనం వస్తుందా . ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఎప్పుడు రై తు భరోసా ఇస్తారు. ఇంకెంత మంది రైతులను బలి తీసుకుం టారు '



అని హరీష్ రావు ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పర్యటనలో కౌలు రైతు బానోతు వీరన్న కుటుంబాన్ని పరామర్శించాలని, ఆ కుటుంబానికి ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకో వాలని డిమాండ్ చేశారు. రైతులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని విన్నవిస్తున్నాం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా కలిసి పోరాటం చేద్దాం. రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది. తెలంగాణ లోమళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే.. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని' హరీష్ రావు అన్నదాతలకు సూచించారు.

# మల్టీ-లెవల్ స్మార్ట్ పార్కింగ్ ప్రత్యేకతలు..



హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో పార్కింగ్ కష్టాలకు చెక్ పడనుంది. కేబీఆర్ పార్క్ వద్ద అత్యాధునిక ఆటోమేటెడ్ స్మార్ట్ మల్టీ-లెవల్ కార్ పార్కింగ్ అందుబాటులోకి వచ్చింది. దీనితో పాటు నగరంలోని రద్దీ ప్రాంతాల్లో మరిన్ని స్మార్ట్ పార్కింగ్ వ్యవస్థలు రానున్నాయి. ఈ కొత్త విధానం ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, పాదచారులకు కూడా ఎంతో మేలు చేస్తుందని మేయర్ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రాజెక్టులతో నగరాన్నితీర్చిదిద్దేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. హైదరాబాద్ నగర వాహనదారులకు గుడ్‌న్యూస్. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ సమస్యతో ఇబ్బంది పడుతున్న వారికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శుభవార్త అందించింది. త్వరలోనే ట్రాఫిక్ కష్టాలు తీరిపోనున్నాయి. నగరంలోఅత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటైన కేబీఆర్ పార్క్ వద్ద జీహెచ్ఎంసీ అత్యాధునిక ఆటోమేటెడ్ స్మార్ట్ మల్టీ-లెవల్ కార్ పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేసింది.

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శనివారం ఈ పార్కింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడిన ఆమె.. ఇలాంటి ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ కార్ పార్కింగ్ వ్యవస్థలను నగరంలోని ప్రధాన పర్యాటక ప్రాంతా లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఇతర అధిక ట్రాఫిక్ జోన్‌లలో పీపీపీ (ప్రైవేట్ పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్) నమూనా కింద త్వరలో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.

ఈ కొత్త కాంపాక్ట్, వర్టికల్‌పార్కింగ్ వ్యవస్థ ద్వారా ట్రాఫిక్ కష్టాలు తీరిపోతాయన్నారు. ఈ వ్యవస్థలు కనీస స్థలంలో గరిష్టంగా వాహనాలను నిలిపే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయన్నారు. ఇది వాహన యజమానులతో పాటు పాదచారులకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. ఈ వ్యవస్థలు రద్దీగా ఉండే ప్రాంతాలలో పార్కింగ్ సవాళ్లను తగ్గించి.. ట్రాఫిక్ రద్దీని కూడా సులభతరం చేయడంలో సహాయపడతాయని మేయర్ విజయలక్ష్మి వెల్లడించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న కమర్షియల్ జోన్లలో అక్రమ పార్కింగ్ సమస్యను ఇది గణనీయంగా తగ్గిస్తుందని తెలిపారు.

### మల్టీ-లెవల్ స్మార్ట్ పార్కింగ్ ప్రత్యేకతలు..:

కేబీఆర్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన ఈ మల్టీ-లెవల్ స్మార్ట్ పార్కింగ్ కాంప్లెక్స్‌లో 72 కార్లు, ద్విచక్ర వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు. ఖీఈఎఆ (రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్) టెక్నాలజీతో కూడినఎంట్రీ,ఎగ్జిట్ వ్యవస్థ ఉంటుంది. లోడ్-బ్యా లెన్స్ సెన్సార్లు, ఆటోమేటిక్ లాకింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేశారు. నిరంతర సీసీటీవీ పర్యవేక్షణ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ వ్యవస్థలు ఉన్నాయి.

ఈపార్కింగ్ సదుపాయం ఉదయం 5 గంటల నుండి రాత్రి11 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. జీహెచ్ఎంసీ అధికారులు మాట్లాడుతూ.. ఈ కాంప్లెక్స్ ద్వారా చట్టవిరుద్ధంగా రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్‌ను తగ్గించి, పాదచారుల వినియోగం కోసం ఫుట్ పాత్‌లను తిరిగివినియోగంలోకి తీసుకురావొచ్చునని తెలిపారు. కేబీఆంపార్క్ దానిని ఆనుకుని ఉన్న వాణిజ్య ప్రాంతాల చుట్టూ ట్రాఫిక్‌కదలిక మరింతసులభతరం అవుతుందని అధికారులు ధీమా వ్యక్తంచేశారు. భవిష్యత్తులో ఈ తరహా ప్రాజెక్టుల ద్వారా హైదరాబాద్ నగరం లో పార్కింగ్‌స్థల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహిం చాలని జీహెచ్ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది.

# ప్రతీఒక్కరి ఫోన్లలో సంచార్ సాథీ యాప్




ముంబై, : భారత్‌లో సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా.. కేంద్రం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఇవి తగ్గడం లేదు. దేశవ్యాప్తంగా రోజూ వందలమంది సైబర్ ఫ్రాడ్స్ ఉచ్చులో పడి మోసపోతున్నారు. లక్షల రూపాయల డబ్బులను పోగొట్టుకుంటున్నారు. రోజుకో కొత్త రూపంలో ప్రజలను బుట్టలో వేసుకుని చాలా స్మార్ట్‌గా మోసానికి పాల్పడుతున్నారు సైబల్ క్రిమినల్స్. మెట్రో సిటీలలో ఇలాంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సైబర్ క్రైమ్ పోలీసులు నేరగాళ్లను పట్టుకుని కొంతమందికి డబ్బులు తిరిగివచ్చేలా చేస్తుండగా..నిందితులను గుర్తించలేక మరికొంతమందికి తిరిగి రావడం లేదు. దేశంలో ఇలాంటి పరిస్థితులే నెలకొనగా.. దీనికి చెక్ పెట్టేందుకు కేంద్రం కొత్త ఆలోచన కనిపెట్టింది. ఇకపై కొత్త మొబైల్ ఫోన్లలో డిఫాల్ట్‌గా కేంద్రప్రభుత్వ 'సంచార్ సాథీ' యాప్‌తప్పనిసరిగా ఉండేలా చేయా లని స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలతో పాటు టెలికాం కంపెనీ లకు టెలికాం మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే తయారై మార్కెట్లోకి లాంచ్ కానున్న ఫోన్లలో కూడా డీఫాల్ట్‌గా యాప్‌రా వాలని,అది డిలీట్ చేయడానికి వీలుకాకుండా ఉండాలని సూచించింది. ఈ మేరకు యాప్ ఇన్‌స్టలేషన్ కోసం టెలికాం, మొబైల్ తయారీ కంపెనీలకు 90 రోజుల గడువు ఇచ్చింది. అయితే థర్డ్ పార్టీయాప్‌లను ముందుగా ఇన్‌స్టాల్ చేయడానికి ఎప్పటినుంచో యాపిల్ వ్యతిరేకత చూపిస్తోంది. దీంతో కేంద్ర కొత్త నిర్ణయాన్ని యాపిల్ వ్యతిరేకించే అవకాశముందని తెలుస్తోంది. యాపిల్ ఒప్పుకోకపోతే కేంద్రం ఎలా స్పందిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. సైబర్ నేరాలు, ఫోన్ల చోరీకి అడ్డుకట్ట వేసేందుకుఈఏడాది జనవరిలో కేంద్రం సంచార్ సాథీ యాప్‌ను ప్రవేశపెట్టింది. మొబైల్‌చోరీకి గురైతే ఇందులోకి వెళ్లి ఫిర్యాదు చేయొచ్చు. ఐఎంఈఐ నెంబర్ ఆధారంగా పొగొట్టుకున్న పనిచేయకుం డా బ్లాక్ చేయడం,ఐఎంఈఐని వెరిఫై చేసుకోవడం,ఫోన్ పోతే ఫిర్యాదు చేయడం. మీపేరుపై ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయే తెలుసుకోవడం వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా చోరీకి గురైన 7 లక్షల మంది ఫోన్లను కేంద్రం గుర్తించింది. ఇక ఐఎంఈఐ నెంబర్ల ట్యాపరింగ్‌కు పాల్పడుతున్న ఘటనలు కూడా ఎక్కువైపోయాయి. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు ప్రతీ ఫోన్‌లో సంచార్ సాథీ యాప్ ఉండాలని కేంద్రం భావిస్తోంది.

# విద్యార్థుల్లో సమానత్వ జాగృతి..



కరీంనగర్: కరీంనగర్, విద్యార్థుల్లో కృతజ్ఞత, సమానత్వ భావనలు పెంపొందించాలనే ఉద్దేశంతో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి మంగళాశాసనాలతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక ప్రతిభా పోటీలో భాగంగా కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించబడ్డాయి ట్రస్మా ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల నుంచి ఆరవ తరగతి నుండి పదో తరగతి వరకు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కరీంనగర్‌లోని కోట రెసొనెన్స్ జూనియర్ కళాశాలలో జరిగిన వ్యాసరచన వక్తృత్వ విభాగాల్లో గణనీయ సంఖ్యలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. పూర్తయిన పరీక్షల ఫలితాలను నేడు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విడుదల చేశారు. వ్యాసరచన విభాగంలో శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల, కరీంనగర్‌కు చెందిన బి.సాయి శ్రేష్ఠ ప్రథమ స్థానం,సరస్వతి పాఠశాల,వెలిచాలకు చెందినటువంటి నెట్టు సంజన ద్వితీయ స్థానం సాధించారు. ఎ. సినీతిక ప్రథమ స్థానం, జెడ్‌పీహెచ్ఎస్ ఆసిఫ్‌నగర్ విద్యార్థి డి. లక్ష్మీ శ్లోక ద్వితీయ స్థానం గెలుచుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన ఈనలుగురు విద్యార్థులు హైదరాబాద్‌లోని జీయర్ స్వామి వారి ఆశ్రమ ంలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫైనల్ పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి విజేతలకు బహుమతులు స్వయంగా చిన్నజీయర్‌స్వామివారి చేతుల మీదుగా ప్రదానం చేయబడనున్నాయి. ఫలితాలను ప్రజ్ఞ వికాస్ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్‌రావు, కోట జూనియర్ కళాశాలల చైర్మన్ డాక్టర్ డి.అంజిరెడ్డి సంయుక్తంగా విడుదల చేశారు,వికాస్ తరంగిణి అధ్యక్షులు గౌతమ్ రావుగారి అధ్యక్షతన జరిగింది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్రస్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని వారు అభిలషించారు.

# ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో నుంచి ఎందుకు వెళ్లిపోతోంది..

హైదరాబాద్, : హైదరాబాద్ నగరంలో దీర్ఘకాలంగా మెట్రో రైల్ ను ఎల్అండ్ టీసంస్థ నిర్వహిస్తోంది.. సేవల విషయంలోనూ సమర్థవంతంగా వ్యవహరిస్తోంది. అయితే అటువంటి సంస్థ మెట్రో రైలు ప్రాజెక్టు నుంచి తప్పుకుంటామని వ్యాఖ్యానించడం సంచలనం కలిగిస్తోంది. దీనికి తోడు ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి కీలక నాయకుడు కేటీఆర్ ముదుపుల వల్లే ఎల్ అండ్ టీ మెట్రో నుంచి వెళ్ళిపోతోందని ఆరోపించారు. దీంతో ఎల్ అండ్ టీ వ్యవహారం రాజకీయంగా సంచలనంగా మారింది..మెట్రో ప్రాజెక్ట్ నుంచి పదేపదే వెళ్ళిపోతామని ఎల్ అండ్ టీ చెబుతుండడం పట్ల రేవంత్ ప్రభుత్వం కూడా సీరియస్ గానే దృష్టి సారించినట్టు తెలుస్తోంది.. పదేపదే వెళ్ళిపోతామని చెబితే.. దానికి తాము సరే అంటామని ప్రభుత్వం చెప్పినట్టు తెలుస్తోంది. మెట్రో రెండో దశ ప్రాజెక్టు ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించి.. నిర్వహించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఈ పరిణామాలు జరుగుతున్న నేపథ్యంలో మొదటి దశ కూడా తామే నిర్వహిస్తామని ప్రభుత్వం ముందుకు వచ్చినట్టు తెలుస్తోంది.. అప్పులు, వడ్డీలు అధికంగా ఉన్నాయని ఎల్ అండ్ టీ చెబుతుండగా.. ఇచ్చిన ఆస్తులు నిర్వహణ సరిగా లేదని ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. అంతర్గతంగాను మెట్రో రైలు నిర్వహణ తనకు ఏమాత్రం ఉపయుక్తంగా లేదని ఎల్ అండ్ టీ అంతర్గతంగా వ్యాఖ్యానించింది. లేఖలు కూడా రాసింది.. మరోవైపు రెండోదశ నిర్మాణానికి సంబంధించి మొదటి విడతలో 24,259 కోట్లు, రెండవ విడుదల 19,450 కోట్లతో ప్రభుత్వమే విస్తరణ చేపడుతుందని ఇటీవల ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. హైదరాబాదులో మెట్రో డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలను మెట్రో రైలు తో అనుసంధానించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఇంతటి భారీ విస్తరణకు ప్రణాళికలు చేపట్టిన ప్రభుత్వం.. మొదటి విడత నిర్వహణను చేతుల్లోకి తీసుకోవడానికి ఇబ్బంది ఉండదని భావిస్తోంది. అయితే ప్రభుత్వం తానంతట తానుగా ఆ ప్రతిపాదన పెట్టదని.. ఒకవేళ ఎల్ అండ్ టీ ఓకే అంటే మాత్రం వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని సర్కార్ ఉన్నట్టు తెలుస్తోంది. మనదేశంలో చాలా రాష్ట్రాలలో ప్రభుత్వాలే మెట్రో రైలు వ్యవస్థను నిర్వహిస్తున్నాయి. తెలంగాణలో కూడా అదే విధంగా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అవసరమైతే దీనికోసం ఒక ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వ మదిలో ఉంది. నిధుల సమీకరణ కూడా దీనికోసం పనికి వస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఎల్ అండ్ టీ కి కేటాయించిన ఆస్తుల విషయంలో నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. ఆస్తుల నిర్వహణ కూడా ప్రభుత్వం చేతికి వస్తే ఆర్థికంగా భారం కూడా ఉండదని తెలుస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో మెట్రో నిర్వహణ ఆర్థిక భారం అవుతుందని. ప్రాజెక్టు కోసం భారీగా పెట్టుబడులు పెట్టినప్పటికీ, ఆర్థిక లాభాలు అనుకున్న స్థాయిలో లభించడం లేదని కంపెనీ ఆందోళన వ్యక్తం చేసింది. అందుకే నిర్వహణ బాధ్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వీకరించాలనీ, ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్‌ను ఏర్పాటు చేయాలని కోరింది. ఎందుకు భారం అవుతోంది హైదరాబాద్ మెట్రోను నిర్మించడానికి ఒఉ సుమారు 20,000 కోట్ల రూపాయలకుపైగా పెట్టుబడి పెట్టింది. ప్రాజెక్టు ప్రారంభ దశలో మంచి ఆదాయం వస్తుందని కంపెనీ అంచనా వేసింది. కానీ వాస్తవంలో కొన్ని ప్రధాన సమస్యలు తలెత్తాయి. కోవిడ్ ప్రభావం మహమ్మారి సమయంలో ప్రయాణికుల సంఖ్య తీవ్రంగా పడిపోయింది. ఇంకా పూర్తిగా రికవరీ కాలేదు. ఆపరేషనల్ ఖర్చులు ఎక్కువ మెట్రో నడపడం, సిబ్బందికి వేతనాలు, విద్యుత్ ఖర్చులు, నిర్వహణా వ్యయాలు అన్నీభారీగా పెరుగుతున్నాయి. అంచనాలకు తగ్గ ప్రయా ణికులు రోజుకు 1012 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా. కానీ ఇప్పటికీ 5 6 లక్షల మందికి మించి ప్రయాణికులు లేరు. రుణ భారం ప్రాజెక్టు కోసం తీసుకున్న అప్పులు, వాటిపై వడ్డీలు కంపెనీకి భారమవుతున్నాయి. ఈ కారణాల వల్లకి నిర్వహణలో ఆర్థిక ఒత్తిడి పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర. ప్రస్తుతం మెట్రో ప్రాజెక్టు పూర్తిగా పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ మోడల్‌లో నడుస్తోంది.


# జాప్యం లేకుండా సిఎంపిఎఫ్ సేవలు: కమిషనర్లు

కమాన్ పూర్: జాప్యం లేకుండా కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సేవలను ఉద్యోగులకు అందించేందుకు కృషి చేస్తున్నామని సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్లు హరిపచౌరి, డా: కె.గోవర్ధన్ లు అన్నారు. జి.ఎం కార్యాలయం నందు సంబంధిత అధికారులు, ఉద్యోగులతో "ప్రయాస్" పై అవగాణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ముందుగా కమిషనర్ ఎన్ సి డబ్ల్యుఎఉద్యోగుల రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ 515పి.పి.ఓఆర్డర్స్ ను పర్స నల్ విభాగాధిపతి సుదర్శనంకు అందజేశారు. ఈ సందర్భంగా సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ హరిపచౌరిమాట్లాడుతూ సిఎంపిఎఫ్ లావాదేవీలు అన్నిసి-కేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఉద్యోగులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా సిఎంపిఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు. సిఎంపిఎఫ్ క్లెయిమ్స్, రివైజ్డ్ పెన్షన్ పై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఉద్యోగుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. పెన్షన్ సీఎంపిఎఫ్ దరఖాస్తులు పెండింగ్ ఉండకుండా చర్యలు చేపట్టామన్నారు.




# కొత్త ఉద్యోగాల్లో మందగమనం

## ద్వితీయార్థంలో 70 శాతం తగ్గొచ్చు టీమ్‌లీస్ ఎడ్‌టెక్ రిపోర్ట్




న్యూఢిల్లీ: దేశంలో కొత్త ఉద్యోగ నియామకాలు అమాంతం పడిపోనున్నాయని రిపోర్టులు హెచ్చరిస్తున్నాయి. ట్రంప్ టారిఫ్‌లతో అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులకు తోడు దేశీయంగా డిమాండ్ తగ్గడం, కృత్రిమ మేధ (ఎఐ) తదితర పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది ద్వితీయార్థంలో అభ్యర్థులకు గడ్డుకాలమేనని టీమ్‌లీస్ ఎడ్‌టెక్ కెరీర్ తన రిపోర్ట్‌లో వెల్లడించింది.

202జులై నుంచి డిసెంబర్ కాలంలో ఫ్రెషర్ల నియామకాలు ఏకంగా 70శాతం తగ్గనున్నట్లు వెల్లడించింది. జనవరి నుంచి జూన్ కాలంలోని ప్రథమార్థంతో పోల్చితే నాలుగు శాతం పాయింట్ల తగ్గుదల చోటు చేసుకోనుందని విశ్లేషించింది. మే నుంచి జులైలో నిర్వహించిన ఈ అధ్యయనంలో 1065 సంస్థల అభిప్రాయాలను సేకరించింది. టీమ్‌లీస్ ఎడ్‌టెక్ రిపోర్ట్ వివరాలు.. నూతన నియామకాల్లో తగ్గుదలను సూచిస్తున్నప్పటికీ.. పలు రంగాల్లో మాత్రం కొంత ఆశాజనంగా ఉంది. ఇ-కామర్స్, రిటైల్, ఐటి రంగాలు డిజిటల్ రూపాంతరంతో ఆశాజనకంగా ఉన్నాయి. సాంకేతిక, సాఫ్ట్ స్కిల్స్ కలిగిన ఫ్రెషర్‌లకు అవకాశాలు దక్కొచ్చు. చిన్న సంస్థలు ఫ్రెషర్‌లను నియమించేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయి.

ఐఓటి ఇంజనీర్, క్లౌడ్ ఇంజనీర్, జూనియర్ వెబ్ డెవలపర్, కంటెంట్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వంటి పాత్రలకు డిమాండ్ ఉంది.

అప్రెంటిష్ నియామకాల్లో బెంగళూరు, చెన్నరు, పూణే నగరాలు ముందు వరుసలో ఉన్నాయి. ఇ-కామర్స్,టెక్నాలజీ స్టార్టప్‌లలో బలమైన నియామకాలకు అవకాశాలున్నాయి.

టీమ్‌లీస్ ఎడ్‌టెక్ వ్యవస్థాపకుడు శాంతను రూజ్ పేర్కొన్నారు. పెద్ద సంస్థలతో పోల్చితే చిన్న సంస్థల్లోనే ఎక్కువ నియామకాలు ఉండొచ్చన్నారు. తయారీ, ఐటి రంగాల్లో బహుళ నైపుణ్యాలు ఉన్న వారికే ఎక్కువ అవకాశాలు దక్కుతున్నాయన్నారు. అయితే ఏఏ రంగాల్లో ఉద్యోగాలు తగ్గొచ్చనే విషయాన్ని టీమ్‌లీస్ తన రిపోర్ట్‌లో స్పష్టం చేయకపోవడం గమనార్హం.

# వరంగల్‌కు మహర్దశ.. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌తో వేల ఉద్యోగాలు



- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులు వేగవంతం
- పీఎం-మిత్ర పథకం కింద కేంద్రం రూ. 200 కోట్ల కేటాయింపు
- మొత్తం రూ. 1,700 కోట్ల పెట్టుబడులతో 12,500 ఉద్యోగాలు
- దక్షిణ కొరియా కంపెనీల నుంచి భారీగా పెట్టుబడులు

వరంగల్: హైదరాబాద్ తర్వాత తెలంగాణలో రెండో రాజధానిగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ప్రతిష్ఠాత్మక కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు, ముఖ్యంగా మహిళలకు భారీగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పీఎం-మిత్ర పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఎంపికైన 7 మెగా టెక్స్‌టైల్ పార్కులలో వరంగల్‌లోని కాకతీయ పార్క్ ఒకటి.

ఈ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించిన కిషన్ రెడ్డి, మొత్తం రూ. 200 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి తొలి విడతగా రూ. 30కోట్లు విడుదల చేశామని, త్వరలోనే మరో రూ. 30 కోట్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. గీసుకొండ మండలం శాయంపేట, సంగెం మండలం చింతపల్లి గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఈ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. భూసేకరణ ప్రక్రియ దాదాపుగా పూర్తయినట్లు మంత్రి తెలిపారు. ఈ పార్కు ద్వారా మొత్తం రూ. 1,700 కోట్ల పెట్టుబ డులు వస్తాయని, తద్వారా 12,500 మందికి పైగా స్థానికులకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని అంచనా. ఇప్పటికే దక్షిణ కొరియాకు చెందిన ఎవర్ టాప్ టెక్స్ అనే సంస్థ రూ. 1,100 కోట్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒక్క కంపెనీతోనే 12 వేల ఉద్యోగాలు రానున్నాయి. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (TSIIC) పర్యవేక్షణలో రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా వంటి అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నారు.

యంగ్ వన్ కార్పొరేషన్ అనే మరో సంస్థ ఇప్పటికే తన యూనిట్‌ను ఏర్పాటు చేసి, 2025 అక్టోబర్ నుంచి వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించనుంది. త్వరలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించి పార్కుకు భూమిపూజ చేయించాలని భావిస్తున్నట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఓరుగల్లు ఆర్థిక స్వరూపమే మారిపోతుందని అంచనా వేస్తున్నారు.

# ట్రంప్ సర్కార్ ఉక్కుపాదం..



న్యూఢిల్లీ: అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం విదేశీ విద్యార్థుల ను రారంపాన పెడుతున్నది.నిబంధనల ఉల్లంఘన పేరుతో వారి వీసాలను అడ్డగోలుగా రద్దు చేస్తున్నది. అలా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 6 వేల మందికిపైగా విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేసింది. వారిలో 4వేల మంది చట్టాల ఉల్లంఘన, డ్రంకెన్ డ్రైవ్, దాడులు, దోపిడీ లాంటి నేరాలకు పాల్పడినట్టు పేర్కొన్నది.

## 6 వేల మంది విద్యార్థుల వీసాలు రద్దు

'హమాస్' ఉగ్రవాద సంస్థకు నిధులు సమీకరిస్తున్నందుకు ఇమిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టం (ఐఎన్ఏ)లోని నిబంధనల కింద మరో 200-300మంది విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేసినట్టు అధికారులు వెల్లడించారు. ఈ సంఖ్యలు అన్ని క్యాటగిరీల్లో పెరుగు తున్న వీసా రద్దుల్లో కేవలం ఒక భాగం మాత్రమే. అమెరికాలో ఈ ఏడాది ఇప్పటివరకు అన్ని క్యాటగిరీల్లో కలిపి దాదాపు 40 వేల వీసాలు రద్దయ్యాయి. ఇవి అంతకుముందు జో బైడెన్ ప్రభుత్వ హయాంలో రద్దయిన 16 వేల వీసాల కంటే చాలా అధికం. అమెరి కా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టాక ఉన్నత విద్యావ్య వస్థను పునర్వ్యవస్థీకరించే పనిలో పడిన ట్రంప్.. ప్రధాన విశ్వవిద్యాలయాలను దృష్టిలో పెట్టుకుని విధానపరమైన మార్పులు చేపట్టారు. కీలక విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు కేటాయించిన నిధుల్లో భారీగా కోత విధించడంతోపాటు వర్సిటీ క్యాంపస్‌లలో ఆందోళనలకు దిగే విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు.

# విశాఖలో మల్టీ లెవల్ పార్కింగ్..



విశాఖపట్టణం: ఆసియా ఖండంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటి. అటు అనకాపల్లి నుంచి ఇటు భోగాపురం వరకూ అన్ని ప్రాంతాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయి. అయితే విశాఖను మాత్రం ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. విశాఖలో పెరుగుతున్న జనాభాకు తోడుగా వాహనాల సంఖ్య పెరగటం, మౌలిక సదుపాయాలు కొరత దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. అలాగే విశాఖ పోర్టు ప్రాంతం కావటంతో.. పోర్టు, పారిశ్రామిక ప్రాంతాల వద్ద క్రేన్లు, భారీ ట్రక్కులు తిరుగుతూ ఉంటాయి. దీంతోనూ వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతూ ఉంటుంది. ఇరుకైన రహదారులు, జంక్షన్లు కూడా విశాఖలో ట్రాఫిక్ సమస్యకు కారణమనే వాదన ఉంది. సిగ్నల్ సమన్వయం లేకపోవటం తో పాటుగా రింగ్ రోడ్లు, ఫ్లైఓవర్ల నిర్మాణంలో జాప్యం కూడా కారణమేనన్న విమర్శలు ఉన్నాయి. ఇక విశాఖలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు పోలీసులు అస్త్రం యాప్ వంటి టెక్నాలజీని కూడా ఉపయోగిస్తున్నారు. కొత్త ఫ్లైఓవర్ల నిర్మాణంపై అధికారులు ఫోకస్ పెట్టారు.అయితే విశాఖవాసులను ట్రాఫిక్ సమస్యలతో పాటు మరో సమస్య కూడా వేధిస్తోంది. అదే పార్కింగ్ సమస్య. సరైన పార్కింగ్ సదుపాయాలు లేక చాలాచోట్ల వాహనదారులు ఇబ్బందులు పడుతు న్నారు. ముఖ్యంగా జగదాంబ జంక్షన్, విశాఖ కేజీహెచ్, విశాఖ కలెక్టరేట్లతో పాటుగా ఇతర గవర్నమెంట్ ఆఫీసుల వద్ద కూడా పార్కింగ్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే ఈ సమస్యకు ప్రస్తుతం కాస్త ఉపశమనం కలిగిందనే చెప్పొచ్చు. పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ రూ.11 కోట్లతో జగదాంబ జంక్షన్ వద్ద మల్టీలెవల్ కారు పార్కింగ్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇది అందుబాటులోకి వచ్చింది.

ఈ మల్టీ లెవల్ కార్ పార్కింగ్‌ను ఐదు అంతస్తులతో ఏర్పాటు చేశారు. ఇనుప గ్రిల్స్‌తో తయారు చేసి, వాహనాల పార్కింగ్ కోసం హైడ్రాలిక్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ కార్యాల యంవద్ద కూడా ఇదే తరహాలో మల్టీ లెవల్ కారుపార్కింగ్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ మల్టీ లెవెల్ కార్ పార్కింగ్‌లో వాహనానికి గంటకు 40 రూపాయలు వసూలు చేస్తున్నారు. మొదటి గంటను 40 రూపాయ లు.. ఆ తర్వాతి నుంచిప్రతి గంటకూ 20రూపా యలుచొప్పున అద్దె నిర్ణయించారు. వాహనదారుల సౌలభ్యం కోసం 3 వేల 500 రూపా యలతో నెలవారీ పార్కింగ్ పాస్ కూడా అందుబాటులోకి తెచ్చారు.


# స్థలంలో ఇళ్లు కట్టకపోతే తిరిగి ఇచ్చేయండి

## గృహ నిర్మాణ సంస్థ నోటీసులు జారీ..

నెల్లూరు : ఏపీలో వారందరికీ బ్యాడ్ న్యూస్.. డబ్బులు వెనక్కి ఇచ్చేయాలని ఏపీ గృహ నిర్మాణ సంస్థ నోటీసులు జారీ చేస్తోంది. ఇంటి పట్టాలు పొందిన తర్వాత అందులో ఇంటి నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం లబ్ధిదారులకు అడ్వాన్సులు కూడా అందించింది. అయితే అడ్వాన్స్ పొందిన తర్వాత కూడా కొంతమంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో అలాంటి వారికి ఏపీ గృహ నిర్మాణ సంస్థ నోటీసులు జారీ చేస్తోంది. ఇంటి పనులు ప్రారంభించాలని.. కుదరకపోతే డబ్బులు వెనక్కి ఇచ్చేయాలని నోటీసులు ఇస్తోంది.ఏపీలో ఇంటి నిర్మాణాల కోసం ఇళ్ల పట్టాలు పొంది.. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి అడ్వాన్సులు పొందిన లబ్ధిదారులకు అధికారులు షాక్ ఇస్తున్నారు. వీలైతే ఇంటి నిర్మాణం చేపట్టాలని.. లేకపోతే ప్రభుత్వం అందించిన అడ్వాన్స్ నగదు తిరిగి చెల్లించాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో పేదలకు ఇంటి నిర్మాణం కోసం పట్టాలు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన స్థలాలలో వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం ప్రజలకు ఒక్కో ఇంటికి రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకూ అడ్వాన్స్ రూపంలో అందించారు. నిర్మాణాలు చేపట్టలేదు. స్థలం నచ్చకో లేదా ప్రభుత్వ సాయం తక్కువగా ఉందనే కారణంతోనో తెలియదు కానీ.. కొన్నిచోట్ల ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టలేదు.మరోవైపు ప్రస్తుత ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం ఎస్సీ, బీసీ సామాజికవర్గాల లబ్ధిదారులకు అదనపు సాయం రూపంలో రూ.50 వేలు చెల్లిస్తోంది. అలాగే ఎస్టీ సామాజికవర్గాల వారికి రూ.75 వేలు చొప్పున అందిస్తున్నారు. ఈ సాయం పొందిన తర్వాత కొంత మంది ఇంటి నిర్మాణాలు ప్రారంభించగా.. మరికొందరు మాత్రం ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదు. ఈనేపథ్యంలో అలాంటి వారిలో కదలిక తెచ్చేందుకు.. అలాంటి వారికి ఏపీ గృహ నిర్మాణ సంస్థ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. ఇంటి నిర్మాణం ప్రారంభించాలని.. అలా వీలు కాకపోతే ప్రభుత్వం అందించిన అడ్వా న్స్ తిరిగి చెల్లించాలని నోటీసులు ఇస్తున్న పరిస్థితి. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించి.. ఆ తర్వాత వాటిని నిలిపివేసిన కుటుంబాలకు.. తిరిగి ఇల్లు కట్టుకునేందు కు ఏపీ ప్రభుత్వం అడ్వాన్సులు అందించింది. కేంద్ర ప్రభుత్వ పథక మైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అలాంటి వారికి అడ్వాన్సు లు అందించారు.

అయినప్పటికీ కొంతమంది పనులు ప్రారంభించ కపోవటంతో ఏపీగృహ నిర్మాణ సంస్థ అధికారులు ఈ చర్యలు తీసుకుంటున్నారు. పేదలకు పక్కా ఇళ్లు ఉండాలనేది ప్రభుత్వం ఉద్దేశమన్న గృహ నిర్మాణ సంస్థ అధికారులు.. అడ్వాన్సులు తీసుకున్న తర్వాత కూడా ఇంటి నిర్మాణాలు చేపట్టని వారికి నోటీసులు ఇస్తున్నామ న్నారు. నోటీసులు అందజేసి పనులు చేపట్టాలని సూచిస్తున్నట్లు గృహ నిర్మాణ సంస్థ అధికారులు చెప్తున్నారు. ఒక వేళ.. అప్పటికీ ఇంటి నిర్మాణానికి ముందుకు రాకపోతే అలాంటి వారి నుంచి అడ్వాన్స్ నగదు రికవరీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు

# రెండు దశల్లో 'జన గణన'



**- డిజిటల్ విధానంలో నిర్వహణ**

**- 2026 ఏప్రిల్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు : కేంద్రం**

న్యూఢిల్లీ : దేశంలో జనగణన రెండు దశల్లో నిర్వహించనున్నట్టు కేంద్రప్రభుత్వం తెలిపింది. 2026 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన జరుగు తుందని లోక్‌సభకు తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వేసినప్రశ్నకు, హోం వ్యవహారాల సహాయమంత్రి నిత్యానంద్ రారు సమాధానమిస్తూ జనగణన గురించి తెలిపారు. జనగణన మొదటి దశలోహౌస్ లిస్టింగ్, సెన్సెస్, రెండో దశలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. 'మొదటి దశ జన గణన 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరుగు తుంది. అయితే ఆయా రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల సౌలభ్యా నికి అనుగుణ ంగా 30రోజుల వ్యవధిలోనే సెన్సెస్ నిర్వహణ ఉంటుందని' నిత్యానంద్ రారు పేర్కొన్నారు. "2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 మధ్యలోరెండో దశజనగణన జరుగుతుంది.

అయితేలడ్డాక్, జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మంచుతో కప్పబడే నాన్-సింక్రోనస్ ప్రాంతాల్లో జనగణన 2026 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 1 మధ్య జరుగుతుంది" అని నిత్యానంద్ రారు లోక్‌సభకు తెలిపారు. ఈ ప్రక్రియకు ముందు వివిధ మంత్రిత్వశాఖ లు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా జన గణన ప్రశ్నాపత్రాన్ని రూపొందించినట్టు మంత్రి చెప్పారు. మన దేశంలో జన గణనకు 150 ఏండ్లకు పైగా చరిత్ర ఉందని, ఇంతకు ముందు నిర్వహించిన జనాభా లెక్కల నుంచి నేర్చుకున్న పాఠాల ఆధారంగా తదుపరి జన గణనకు పరిగణనలోకి తీసుకుంటామని ఆయన అన్నారు. డిజిటల్ విధానంలో: 2027 జనాభా లెక్కింపు డిజిటల్ వేలో నిర్వహించనున్నట్లు మంత్రి నిత్యానంద్ రారు పేర్కొన్నారు. మొబైల్ యాప్‌ల ద్వారా డేటాను సేకరిస్తామని, స్వీయ గణనకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కులగణన కూడా: మరో ప్రశ్నకు నిత్యానంద్ రారు సమాధానం ఇస్తూ, ఈ ఏడాది ఏప్రిల్ 30న రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిన విధంగా కుల గణనను కూడా ఈ జనాభా గణనలోనే జరుగుతుందని ఆయన లోక్‌సభకు తెలిపారు.

# పెరిగిన రిజిస్ట్రేషన్ల ఆదాయం



విజయవాడ: ఏపీలో రియల్ ఎస్టేట్‌కు మంచి రోజులు వస్తున్నాయి. గత కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా పుంజుకుంటోందని రియల్ ఎస్టేట్ వర్గాలు చెప్తున్నాయి. గతేడాది మొదటి త్రైమాసికంతో పోలిస్తే.. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో పెరిగిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం.. రియల్ ఎస్టేట్ పుంజుకుంటోం దని చెప్పడానికి సంకేతంగా చెప్తున్నారు. అమరావతితో పాటుగా ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులు చేపడుతున్న ప్రాంతాల్లోనూ భూలావాదేవీలు పెరుగుతున్నాయని.. భూముల ధరలు పెరుగుతు న్నాయని చెప్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా పుంజుకుంటోంది. కొన్నేళ్లుగా ఏపీలో స్తబ్దుగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం కార్యకలాపాలు క్రమంగా పెరుగుతున్నాయని నిపుణులు చెప్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తున్నారని.. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా భూ లావాదేవీలు పెరిగాయని చెప్తున్నారు. అలాగే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం పెరగటం కూడా ఏపీలో రియల్ ఎస్టేట్ పుంజుకుంటోందనడానికి సంకేతాలని వెల్లడిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంతో పోలిస్తే.. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఏపీలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 46 శాతం పెరిగిందని లెక్కలు చెప్తున్నాయి. ఇక వృద్ధి రేటు కూడా 39 శాతంగా ఉందని.. రియల్ ఎస్టేట్ రంగం రికవరీ చెందిందనడానికి ఇదో సంకేతమని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు.అమరావతిలో సుమారుగా 50 వేల కోట్ల విలువైన పనులు మొదలు కావటంతో అమరావతి నిర్మాణంపై ఇన్వెస్టర్లలో నమ్మకం పెరిగిందని తెలుస్తోంది. దీంతో అప్పటి వరకూ వేచి చూసే ధోరణిలో ఉన్న పెట్టుబడిదారులు.. రాజధానిపై ఆసక్తి చూపటం మొదలుపెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం డేటాను విశ్లేషిస్తే..కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాలలో భూలావాదేవీలు అధికంగా జరిగాయి. అలాగే ఆదాయం కూడా ఈ ప్రాంతాల నుంచి ఎక్కువగా సమకూరింది. దీంతో ఏపీలో రియల్ ఎస్టేట్ రంగాన్ని అమరావతి నడిపిస్తోందనే విశ్లేషణలు వస్తున్నాయి. దీంతో అమరావతితో పాటుగా.. ఆ చుట్టుపక్కల ప్రాంతాలలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి.మరోవైపు 2024 ఎన్నికల ఫలితాల తర్వాత అమరావతిలో భూముల ధరలు అమాంతం పెరిగాయని రియల్టర్లు చెప్తున్నారు. రేట్లు పెరగటంతో లావాదేవీలు తగ్గిపోయా యని వివరిస్తున్నారు.

# పాలకులు కూల్చేస్తే.. ప్రజలు నిలబెట్టారు..!



అన్యాయాన్ని, అక్రమాన్ని తన కలం గళంతో గట్టిగా వినిపించినందుకు జమ్మూలో ఉంటున్న ఓ ముస్లిం జర్నలిస్టు ఇంటిని అధికారులు ఇటీవల నిట్టనిలువునా కూల్చేశారు. కుప్పకూలిన ఆ ఇంటి ముందు నిరాశ్రయంగా ఆ జర్నలిస్టు వృద్ధ తల్లిదండ్రులు, భార్యా పిల్లలు బిక్కుబిక్కుమంటూ ఉంటే, వాళ్లని చూసి ఇంటిని కూల్చిన వారు తెగ సంతోషపడిపోయారు. అయితే అది వారికి క్షణం కాలం మాత్రమే మిగిలింది. ఆ ముస్లిం జర్నలిస్టు కుటుంబానికి 'నేనున్నా' అంటూ ఓ హిందు సోదరుడు ముందుకు వచ్చాడు. కూల్చేసిన భూమికి రెట్టింపు భూమిని అతనికి బహుమతిగా ఇచ్చాడు. 'కులాలు, మతాలు వేరైనా మేమంతా మనుషులం. మత సామరస్యంతో మెలగడం మా నైజం' అంటూ అక్కడున్న వారికే కాదు, దేశం నలుమూలలా వినపడేంత గట్టిగా చెప్పాడు. మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్న ముఠాతో ఓ పోలీసు అధికారికి ఉన్న సంబంధాల గుట్టును రట్టు చేసిన ఆ పాత్రికేయుడు అర్ఫజ్ అహ్మద్ డయాంగ్. 'నీస్ సహర్ ఇండియా' పేరుతో డిజిటల్ న్యూస్ పోర్టర్‌ని అతను నిర్వహిస్తున్నాడు. అక్రమ రవాణాలో పోలీసు సంబంధాల వార్త అక్కడి ప్రజల్లో తీవ్ర కలకలం రేపింది. పోలీసులు అప్రమత్తమయ్యారు. అర్ఫజ్‌పై బెదిరింపులకి దిగారు. చివరికి సరైన పత్రాలు లేవంటూ అతని ఇంటిని కూల్చేశారు. అడ్డుకొన్న అర్ఫజ్‌ని పోలీసులు నోటికొచ్చినట్లు దుర్భాషలాడారు. కొట్టారు. 'తమకి కొంచెం సమయం ఇవ్వమ'ని అర్ఫజ్ కుటుంబ సభ్యులు అధికారుల కాళ్లావేళ్లా పడడం అక్కడున్న వారి గుండెలు బరువెక్కించింది. అయినా వారు కనికరం చూపలేదు. అప్పుడే ఆ ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త కులదీప్ శర్మ వారికి అండగా నిలబడ్డారు. అర్ఫజ్ తిరిగి ఇంటిని నిర్మించుకునేందుకు అవసరమైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు.'నిధుల కోసం దాతలను అడుక్కోవాల్సి వచ్చినా సరే మీ కోసం ఇంటిని కట్టిస్తాను. ముస్లింలకు హిందువులను వ్యతిరేకులుగా చిత్రీకరించే కుట్ర ఎన్నటికీ విజయం సాధించదు. మన మధ్య సోదరభావం చిరకాలం కొనసాగుతుంది. మీరు మంచి మనిషి. మీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు చేకూరాలి' అంటూ అర్ఫజ్‌కి ఇంటి పత్రాలు ఇస్తూ కులదీప్ కన్నీటిపర్యంత మయ్యారు. ఇంకా ఆయన ఇలా అన్నారు. 'చూడండి, ఆయన పిల్లలు ఆరుబయట ఎలా కూర్చున్నారో ఇది ప్రభుత్వానికి సిగ్గుచేటు. దేశ పౌరులు అయినప్పటికీ వీరు నిరాశ్రయులయ్యారు' అని వాపోయారు. కులదీప్ శర్మ కుమార్తె తానియా మాట్లాడుతూ తండ్రి తీసుకున్న నిర్ణయం తమకు ఎంతో గర్వకారణమని చెప్పింది. 'నాకు చాలా బాధగా ఉంది. రాత్రికి రాత్రే అర్ఫజ్ ఇంటిని ఎలా కూల్చివేస్తారు అతను నాకు సోదరుడి వంటి వాడు. నేను మాత్రమే కాదు.. నా కుటుంబం, ఈ సమాజం మొత్తం ఆయనకు అండగా నిలుస్తుంది' అని తానియా చాలా గట్టిగా చెప్పింది. 2025 నవంబర్ 27న అర్ఫజ్ ఇంటిని కూల్చివేసిన తర్వాత వేలాది మంది ప్రజలు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. అర్ఫజ్ తండ్రి గులామ్ ఖాదిర్ ఆ సందర్భాన్ని ఇలా చెప్పారు.

'అధికారులు మా ఇంటిని కూల్చారు. మమ్మల్ని నిరాశ్రయులని చేశామని అనుకున్నారు. అయినా ప్రజలు మా పక్షాన నిలిచారు. నా కుమారుడికి మద్దతు ఇచ్చారు. ఇది నాకు ఎంతో విలువైనది. ఇంతకంటే నేను ఏం ఆశించగలను ఇలాంటి ఉదంతాలు జమ్మూకాశ్మీర్‌లో ఇప్పటికీ మత సామరస్యం నెలకొని ఉన్నదని నిరూపిస్తున్నాయి. నేను నిజంగా సంతోషిస్తున్నాను. అవినీతిపరులను, అక్రమంగా వ్యాపారాలు చేసే వారిని,భూములను కబ్జా చేసే వారిని ఎవరూ ప్రశ్నించరు.

ఒకే అంతస్తుతో నిర్మించిన ఇంటిని జమ్మూ డెవలప్‌మెంట్ అథారిటీ లక్ష్యంగా చేసుకుంది. నలభై సంవత్సరాల క్రితం దీనిని కట్టారు.మాకు వేరే ఇతర ఆస్తులేవీ లేవు.ఒకవేళ నా కుమారుడు నిజంగా అవినీతిపరుడై ఉంటే మా కోసం పెద్దఇంటినే కట్టి ఉండేవాడు' అని ఆయన ఆవేదనగా మాట్లాడారు. నేలమట్టమైన ఇంటి శిథిలాల వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టార్పాలిన్ గుడారంలో ప్రస్తుతం అర్ఫజ్ నివసిస్తున్నారు. కూలిపోయిన తన ఇంటి శిథిలాలు చూపిస్తూ.. 'చూడండి.

ఈ దేశంలో అన్యాయాలు, అక్రమాలు చేసిన సాధువులు కూడా దర్జాగా బతుకు తున్నారు. సత్యాన్ని చూపించిన జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు మాత్రం ఇలా బాధపడుతున్నారు' అని ఓ వీడియో ఫుటేజ్‌ని విడుదల చేశారు. గతంలో కూడా పోలీసులు అర్ఫజ్ ఇంటిని కూల్చేశారు. అప్పటి నుండి అతను తన తండ్రి ఇంట్లో తలదాచుకుంటున్నారు. ఇప్పుడు ఆ ఇంటిని కూడా కూల్చేశారు.

# ఇక పెరిగేది ఎప్పుడూ

విశాఖపట్టణం,: దేశంలో బీజేపీకి బలమైన నాయకత్వం ఉంది. మోదీ,అమిత్ షా వంటి వారు ఎప్పటికప్పుడు రాజకీయ వ్యూహాలను రచించుకుంటూ పార్టీని అన్ని రాష్ట్రాల్లో గెలుపు దిశగా తీసుకెళుతున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ మాత్రం మోదీ, అమిత్ షా చేతుల్లో లేదని వారికీ అర్థమయింది. ఇక్కడ రాష్ట్ర స్థాయి నేతలు ఎవరూ పెద్దగా పార్టీని బలోపేతం చేసే ప్రయత్నం చేసేందుకు ప్రయత్నించరు. గత కొన్ని దశాబ్దాల నుంచి బీజేపీకి ఏపీలో పట్టు లేదు. ఒంటరిగా పోటీ చేస్తే సింగిల్ డిజిట్ ఓటింగ్ శాతానికి మాత్రమే పరిమితమవుతుంది. అందుకే టీడీపీ, జనసేన అండతోనే పార్లమెంటు స్థానాలయినా, అసెంబ్లీ సీట్లయినా గెలిచింది.

బీజేపీ నేతలు తమ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు ఇప్పటి నుంచి కాదు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి.ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కానీ, విభజన తర్వాత కానీ బీజేపీ ఏపీలో ఏదైనా బలపడిందా అంటే లేదనే సమాధానమే వస్తుంది. పోనీ నాయకత్వం సరైనది లేదా అంటే ఎందుకు లేరు.. ముప్పవరపు వెంకయ్య నాయుడు నుంచి కంభపాటి హరిబాబు,సోము వీర్రాజు, పురంద్రీశ్వరి.. నేడు మాధవ్ ఇలా రాజకీయాల్లో పట్టున్న వారే. కొంత జనాకర్షణ కలిగిన నేతలే. సామాజికవర్గం అండగా ఉన్న లీడర్లే. కానీ ఏ నియోజకవర్గంలోనూ ఒంటరిగా గెలిచేటంతగా పార్టీని తీసుకెళ్లలేకపోవడానికి కారణాలపై ఇంత వరకూ కమలం పార్టీలో అంతర్మథనం జరగలేదు. పొరుగున ఉన్న తెలంగాణలో ఒంటరిగా బీజేపీ బలపడుతున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ లో మాత్రం ఇంత వరకూ ఒక్క పర్సెంట్ కూడా ఎదగలేదన్నది యదార్థం.దీనిపై కేంద్ర నాయకత్వం కూడా ఒకింత సీరియస్ గానే ఉందని తెలిసింది. కేంద్ర మంత్రి పదవులు, రాష్ట్రంలో మంత్రి పదవులు, గవర్నర్ గిరీ కట్టపెట్టినా ఏ మాత్రం ఫలితం ఎందుకు ఉండలేదని జాతీయ స్థాయి నాయకత్వంలో చర్చ ప్రారంభమయినట్లు తెలిసింది. ఎప్పటికీ ఇతరులపై ఆధారపడి ఎన్నేళ్లు రాజకీయాలు చేయాలన్న అసహనం కూడా అగ్రనాయకత్వం వ్యక్తం చేస్తున్నట్లు కనపడుతుంది. అందుకే బీజేపీ కేంద్ర నాయకత్వం ఏపీని తమ జాబితా నుంచి తొలగించినట్లేనని భావిస్తుంది. అలాగని పార్టీని పూర్తిగా వదిలేయడం మంచిది కాదని, త్వరలోనే కేంద్ర నాయకత్వం రాష్ట్ర నాయకులను పిలిచి క్లాస్ పీకే అవకాశాలు కూడా లేకపోలేదన్నది హస్తిన వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. మరి ఇప్పటికైనా బీజేపీ రాష్ట్ర నాయకత్వంలో కదలిక వస్తుందా లేదా అన్నది చూడాలి.

# అడ్డూ అదుపులేని వెండి ధరలు!

### వేలల్లో పెరుగుతూ బంగారానికి సవాల్

### రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిక

న్యూఢిల్లీ: వెండిధరలు అదరగొడుతున్నాయి. బంగారం తో నాకేంటి పోటీ అన్నట్లుగా అమాంతంగా పెరుగుతున్నాయి. పెరగడమే తప్ప తగ్గడం లేదు. సరిగ్గా ఏడాది క్రితం వెండి ధర కిలో తొలిసారి లక్ష రూపాయలు దాటితే అంతా అబ్బో అనుకున్నారు. కానీ, ఇప్పుడు అదే వెండి పసిడికి ఏమాత్రం తక్కువ కానంటోంది. పట్టపగ్గాల్లేకుండా దూసుకెళుతోంది. దేశీయంగా కిలో వెండి రూ.1.84 లక్షల వద్ద సరికొత్త రికార్డు గరిష్ఠాలను నమోదు చేసింది. అటు పసిడి సైతం రూ.1.30 లక్షల పైనే పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరగడానికి తోడు, రూపాయి విలువ పతనం కావడమూ ఈ లోహాల ధరల పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. వెండి అత్యధికంగా రూ.3,126 పెరిగి రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరింది. బుధవారం డాలరుతో రూపాయి మారకం విలువ 90 మార్కు దాటింది. దీంతో దేశీయంగా వీటి ధరలు పెరిగాయి. దీనికితోడు యూఎస్ ఫెడ్ వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,204 వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 57.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.1.32 లక్షలు పలుకుతుండగా.. కిలో వెండి రూ.1.83 లక్షలుగా ఉంది. గతంలో దేవుళ్ల బొమ్మలు, పూజా సామగ్రి, సంపన్నుల ఇళ్లల్లో పళ్లాలు, గ్లాసులకు వెండిని దేశీయంగా వినియోగించేవారు. కొవిడ్ తర్వాత పరిస్థితులు మారాయి. పారిశ్రామికంగా వెండి వినియోగం పెరిగింది. సౌర విద్యుత్ రంగం, విద్యుత్ కార్లు, మొబైల్స్ తదితర



రంగాల నుంచి దీనికి డిమాండ్ పెరిగింది. దీనికితోడు చిన్న మదుపరులు పెట్టుబడి కోసం వెండిని కొనడం ప్రారంభించారు. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తి బంగారంతో పాటు వెండికీ ఉందని చెబుతుండటంతో, మదుపరుల్లో ఆసక్తి పెరుగుతోంది. దీంతో ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెడుతున్నారు.



### నా బార్డ్ నిధులతో

# గోదాములు



హైదరాబాద్: తెలంగాణలో మూడేళ్లలో ధాన్యం ఉత్పత్తి మూడు రెట్లు పెరిగినప్పటికీ వాటిని నిల్వ చేసేందుకు అవసరమైన మేరకు గోదాములు లేవు. దీంతో కొత్తగా 26 గోదాములను నిర్మించేందు కు రాష్ట్ర సర్కారు ఏర్పాట్లు చేస్తోంది.వీటిలో 12 గోడౌన్లను ప్రభుత్వ నిధులతో, మరో 14 గోదాములను నాబార్డు నిధులతో నిర్మిస్తుంది. వీటి కోసం రూ. 295.68 కోట్లు ఖర్చుచేస్తుంది. 2.91 లక్షల టన్నుల స్టోరేజీతో గోదాముల నిర్మాణం జరగనుంది. వేర్ హౌజింగ్ శాఖ ఆధ్వర్యంలో 12 గోదాములను, 1.51 లక్షల టన్నుల స్టోరేజీ సామర్థ్యంతో నిర్మిస్తారు. నాబార్డు సహకారంతో 14 గోదాములను రూ.140 కోట్ల రుణాలతో 1.40 లక్షల టన్నుల సామర్థ్యంతో ఉండేలా గోడౌన్ల నిర్మాణం చేపట్టారు.పర్యావరణ అనుకూల పంథాలో వీటి నిర్మాణం ఉంటుంది. అందులోని పంటలకు ఎలుకలు, చీడపీడల బెడద లేకుండా చేసేందుకు గాలి వెలుతురు ఉండేలా స్టోరేజ్ వృథాను నివారించేలా నిర్మిస్తారు.కాగా, 2024-25 ఏడాది తెలంగాణలో 190 లక్షల టన్నుల ధాన్యంతో పాటు 30 లక్షల టన్నుల మక్కల దిగుబడి వచ్చింది. టన్నుల పత్తితో పాటు 20 లక్షల టన్నుల ఇతర పంటల దిగుబడి వచ్చింది. వాటిని నిల్వచేసుకోవడానికి గోదాములు సరిపోవడం లేదు.రైతులు ప్రతి ఏడాది పంటలను నిల్వచేసుకోవడానికి అనేక సమస్యలు ఎ దుర్కొంటున్నారు. గోదాములు అవసరాల మేరకు లేకపోవడంతో పంట తేమ పెరగడం, తడిసిపోవడం, ఎలుకలు, పురుగులు పడుతున్నాయి.ప్రస్తుతం ప్రభుత్వ రంగంలో తెలంగాణ వ్యాప్తంగా 24.59 లక్షల టన్నుల సామర్థ్యమున్న 253 గిడ్డంగులు ఉన్నాయి. అయితే, అవి సంప్రదాయ నమూనాలో ఉండడంతో, వాటి నిర్వ హణలో ఇబ్బందులు వస్తున్నాయి.

# మళ్లీ సెంటిమంట

హైదరాబాద్: తెలంగాణ నేతలు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై విరుచుకుపడుతున్నారు. ఆయన క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. ముందుగా బీఆర్ఎస్ నేతలు ఈ డిమాండ్ చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు దానిని కొనసాగిస్తున్నారు. తాజాగా తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పవన్ కళ్యాణ్ పై సంచలన ఆరోపణలు చేశారు. పవన్ క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకుంటే తెలంగాణలో ఆయన సినిమాలను ఆడనివ్వమని..

అనుమతి సైతం నిలిపివేస్తామని హెచ్చరించారు. అసలు పవన్ కళ్యాణ్ కు రాజకీయాలే తెలియని తేల్చేశారు కోమటిరెడ్డి వెంకటరెడ్డి. అయితే నిజంగా వెంకట్ రెడ్డి పవన్ కళ్యాణ్ పై కోపంతో ఈ వ్యాఖ్యలు చేశారా లేకుంటే బి ఆర్ ఎస్ ఈ విషయంలో ముందంజలో ఉందని భావించి చేశారా అన్నది తెలియాల్సి ఉంది. మొన్నటి అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా ఒక వ్యాఖ్య ఆయన నోటి నుంచి వచ్చింది. అదే ఇంతటి వివాదానికి కారణం అయింది. యధాలపంగా వ్యాఖ్యలు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సముద్ర జలాలు మూలంగా కొబ్బరి తోటలు నాశనం అవుతున్నాయి. పచ్చటి తోటలు సైతం ఖాళీ అయి అంద విహీనంగా కనిపిస్తున్నాయి. స్థానిక రైతుల విన్నపం మేరకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆ తోటలను పరిశీలించారు.

ఈ క్రమంలోనే కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రాంతంలో కోనసీమ లాంటి అందమైన ప్రదేశం ఉండకపోవడంతో అక్కడి ప్రజలు ఎప్పుడూ బాధపడుతుంటారని.. ఆదిష్టి తగిలినట్లు ఉందని అర్థం వచ్చేలా మాట్లాడారు.పవన్ కళ్యాణ్ సానుకూల దృక్పథంతోనే ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ పై ఎటువంటి వ్యతిరేక భావనతోవీటిని చేయలేదు. అయితే బిఆర్ఎస్ నేత జగదీశ్వర్ రెడ్డి అయితే పవన్ కళ్యాణ్‌కు బుర్ర లేదు అంటూ సంచలన కామెంట్స్ చేశారు. అటు తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఒంటరిగా పోటీ చేయలేదు కానీ అంటూ వైసిపి ట్యాగ్ లైన్ తో మాట్లాడారు. ఇప్పుడేమో మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ఏకంగా పవన్ కళ్యాణ్ సినిమాలపైనే మాట్లాడారు. క్షమాపణ చెప్పకపోతే తెలంగాణలోపవన్ కళ్యాణ్ సినిమాలు ఆడనివ్వబోమని హెచ్చ రికలుపంపారు.

ఆ ముగ్గురు ఎన్నిసార్లు క్షమాపణ చెప్పాలి అయితే ఇప్పుడు పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెబుతారా అనేది హాట్ టాపిక్ అవుతోంది. ఎందుకంటే పవన్ వ్యతిరేక భావనతో ఆ వ్యాఖ్యలు చేయలేదు.

# నెంబర్ వన్ గా జియో

ముంబై: దేశీయ టెలికాం దిగ్గజం రిలయన్స్ జియో దూసుకుపోయింది. లక్షలాది మంది కొత్త కస్టమర్లను చేర్చుకుంది. అక్టోబర్ నెలలో జియోకు కొత్తగా 19.97 లక్షల మంది చేరినట్లు ట్రాయ్ వెల్లడించింది. దీంతో కంపెనీ మొబైల్ కస్టమర్లు 48.47 కోట్లకు చేరుకున్నారు. అలాగే ఎయిర్‌టెల్ వైర్‌లెస్ యూజర్లు 12.52 లక్షల మంది చేరడంతో మొత్తం సంఖ్య 39.36 కోట్లకు చేరుకున్నారు. ట్రాయ్ వివరాల ప్రకారం.. అంతకు ముందు నెలలో 39.24 లక్షల మంది ఉన్నారు. ఇక ప్రభుత్వరంగ టెలికాం సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు 9.25 కోట్లకు చేరారు. కానీ, వొడాఫోన్ ఐడియాకు మరోసారి భారీ షాక్ తగిలింది. గత నెలలోనూ కంపెనీ నెట్‌వర్క్ నుంచి 20.83 లక్షల మంది వెళ్లిపోయారు. దీంతో కంపెనీ మొబైల్ యూజర్లు 20 కోట్లకు పడిపోయినట్టు ట్రాయ్ తన నెలవారి సమీక్షలో వెల్లడించింది. మొత్తంమీద దేశీయంగా 123 కోట్ల మంది టెలిఫోన్ సబ్‌స్క్రైబర్లు ఉన్నట్టు ట్రాయ్ తెలిపింది.మొత్తం బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య సెప్టెంబర్ చివరి నాటికి 995.63 మిలియన్ల నుండి అక్టోబర్ చివరి నాటికి 999.81 మిలియన్లకు పెరిగింది.నెలవారీ వృద్ధి రేటు0.42 శాతం. ఆర్జియె 50.84 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉండగా, భారతీ ఎయిర్‌టెల్ 31.26 శాతం,విఐ 12.72 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి.2025 సెప్టెంబర్ చివరి నాటికి 46.61 మిలియన్లుగా ఉన్న వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 2025 అక్టోబర్ చివరి నాటికి 46.75 మిలియన్లకు పెరిగింది. వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ బేస్‌లో నికర పెరుగుదల




0.14మిలియన్లు, నెలవారీ వృద్ధి రేటు 0.30 శాతం. అక్టోబర్ 2025లో వైర్‌లైన్ మార్కెట్‌లో రిలయన్స్ జియో 30.75 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 22.86 శాతం, వొడాఫోన్ ఐడియా 1.74 శాతం వాటాను కలిగి ఉన్నాయి. మూడు పిఎస్యూ యాక్సెస్ సర్వీస్ ప్రొవైడర్లు అయిన బీఎస్ఎన్ఎల్ , ఎంటీఎన్ఎల్, ఒఖూఈఒ వైర్‌లైన్ మార్కెట్ వాటాలో20.22% శాతం వాటాను కలిగి ఉన్నాయి.2025 సెప్టెంబర్1,182.32 నాటికి వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య1182.32 మిలియన్ల నుండి 2025 అక్టోబర్ చివరి నాటికి 1184.62 మిలియన్లకు పెరిగింది. తద్వారా నెలవారీ వృద్ధి రేటు 0.19 శాతంగా నమోదైంది. 2025 అక్టోబర్‌లో వైర్‌లైన్ మార్కెట్‌లో రిలయన్స్ జియో 41.36 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 33.59 శాతం, వొడాఫోన్ ఐడియా 17.13 శాతం వాటాను కలిగి ఉన్నాయి. రెండు పిఎస్యూ యాక్సెస్ సర్వీస్ ప్రొవైడర్లు అయిన బీఎస్ఎన్ఎల్,ఎంటీఎన్ఎల్ మార్కెట్ వాటా కేవలం 7.92 శాతం మాత్రమే.

# కన్నవాళ్లు వదిలేస్తే.. వీధి కుక్కలు కాపాడాయి



ప్రస్తుతం చిన్నారులపై కుక్కలు విచక్షణారహితంగా దాడులు చేస్తున్న వార్తలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న సమయంలో.. అప్పుడే పుట్టిన చిన్నారికి వీధి కుక్కలే రక్షణగా మారిన ఘటన వైరల్‌గా మారింది. ఓ నవజాత శిశువును కన్నవారు రోడ్డుపై వదిలేస్తే.. చిన్నారికి వీధి కుక్కలు రక్షణగా నిలిచిన ఘటన పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లాలో వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నదియా జిల్లాలోని రైల్వేవర్కర్స్ కాలనీలో ఓ బాత్‌రూమ్ ఎదుట అప్పుడే పుట్టిన పసికందును తల్లిదండ్రులు బుధవారం తెల్లవారుజామున వదిలేసి వెళ్లారు. దుప్పటిలో చుట్టి ఉన్న ఆ పసికందు చుట్టూ వీధి కుక్కలు చేరి.. ఉదయం వరకు చిన్నారికి రక్షణగా ఉన్నాయి. తెల్లవారిన తర్వాత కుక్కల మధ్యలో చిన్నారి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే ఆ పసికందును ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పసికందుపై కుక్కలు వ్యవహరించిన తీరును స్థానికులు ప్రశంసిస్తున్నారు. చిన్నారి చుట్టూ చేరిన కుక్కలు చలిలో కొన్ని గంటల పాటు.. పసికందుకు కాపలాగా నిలబడే ఉన్నట్లు పేర్కొన్నారు. చిన్నారిని ఆస్పత్రికి తరలించడానికి వెళ్లినప్పుడు ముందు ఎవరినీ దగ్గరకు రానివ్వలేదని తెలిపారు. అనంతరం పొరుగువారి సాయంతో శిశువును మహేశ్‌గంజ్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని.. చిన్నారిని ఎవరు వదిలివెళ్లారనే విషయం తెలుసుకోవడానికి స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలు పరిశీలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# మరింతగా క్షీణించిన రూపాయి

ముంబై: యుఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఉదయం ట్రేడింగ్‌లో 6 పైసలు తగ్గి చరిత్రలో తొలిసారిగా 90.02కి చేరుకుంది. గ్రీన్‌బ్యాక్‌తో పోలిస్తే 89.96 వద్ద ప్రారంభమైన రూపాయి, రికార్డు స్థాయిలో 90.15కి చేరుకుంది. తరువాత కొంత కోలుకుని 90.02 వద్ద ట్రేడవుతోంది. ఇది దాని మునుపటి ముగింపు కంటే 6 పైసలు తగ్గింది. బ్యాంకులు అధిక స్థాయిలో యుఎస్ డాలర్లను నిరంతరం కొనుగోలు చేయడం, ఎఫ్ఐఐ ఇన్‌ఫ్లోలు కొనసాగడం దీనికి కారణమని చెబుతున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లలో, సెన్సెక్స్ 165.35 పాయింట్లు తగ్గి 84,972.92కు, నిఫ్టీ 77.85 పాయింట్లు తగ్గి 25,954.35కు చేరుకుంది. రూపాయి క్షీణత అకస్మాత్తుగా సంభవించలేదు. ఇది 2025 అంతటా క్రమంగా తగ్గుతూ వచ్చింది. అప్పుడప్పుడు తిరిగి పుంజుకునే సంకేతాలు వచ్చినప్పటికీ కొనసాగలేకపోయింది. 2025 ప్రారంభంలో రూపాయి బలహీనపడటం ప్రారంభమైంది.

2025 జనవరి మధ్య నాటికి, రూ.86.70కి పడిపోయింది. మార్చి 10న 30 పైసలు తగ్గి సుమారు రూ.87.25కి చేరుకుంది. సెప్టెంబ



ర్‌లో ఇది ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి చేరుకుంది. దాదాపు రూ.88.79కి చేరుకుంది. నవంబర్ 21న రూ.89.49కి పడిపోయింది. నవంబర్ చివరిలో ఇది కోలుకునే సంకేతాలను చూపించింది. కొన్ని రోజుల్లో రూపాయి రూ.89.26- రూ.89.28 మధ్య ట్రేడవుతూ నిలిచింది. కానీ దీనిని నిలబెట్టుకోలేకపోయింది. డిసెంబర్ నాటికి ఇది 90 దాటి దిగువకు పడిపోయింది.

# ప్రైవేట్ రంగంలో న్యూక్లియర్ ఎనర్జీ..

న్యూక్లియర్ ఎనర్జీ.. వినియోగించే తీరుపై దీని పవర్ ఆధారపడి ఉంటుంది. విధ్వంసానికి వాడితే ప్రపంచం నాశనం అవుతుంది. సద్వినియోగం చేసుకుంటే అనేక దేశాలు అభివృద్ధి చెందుతాయి. యురేనియంతో ఉత్పత్తి చేసే పవర్‌తో విద్యుత్ ధరలు చాలా వరకు తగ్గుతాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీ ఇటీవల ప్రైవేటు సంస్థలుకు న్యూక్లియర్ విద్యుత్ ఉత్పత్తిలో భాగస్వామ్యం అందించే నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం 8 10 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న భారత్ రాబోయే కాలంలో 100 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇది విద్యుత్ బిల్లులు 5,000 నుంచి 500 రూపాయల వరకు తగ్గే అవకాశాన్ని కలిగిస్తుంది.ప్రపంచంలో న్యూక్లియర్ విద్యుత్ ఉత్పత్తిలో చైనా మొదటి, అమెరికా రెండో స్థానంలో ఉండగా, భారత్ మూడో స్థానంలో నిలిచింది. యురేనియం సమృద్ధితో, భారత్ ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఈ శక్తిని మరింత విశాలపరిచే అవకాశాలు ఉన్నాయి. అమెరికా, కెనడా వంటి దేశాల సంస్థలు భారత్‌లో పెట్టుబడులు పెడితే స్థాయి మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.ప్రైవేటీకరణతో న్యూక్లియర్ ఉత్పత్తి పెరిగితే విద్యుత్ తీవ్రంగా సరఫరా అవ్వడం వల్ల పాకిస్తాన్ కు భయాందోళనలు ఏర్పడతాయని నిపుణులు భావిస్తున్నారు.

అణు విద్యుత్తుకు అవసరమైన యురేనియం ను తవ్వడానికి, దిగుమతి చేసుకోవడానికి, ప్రాసెస్ చేయడానికి ప్రైవేట్ సంస్థలను అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. 2047 నాటికి అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 12 రెట్లు పెంచాలని యోచిస్తోంది. అలా జరిగితే భారతదేశ మొత్తం విద్యుత్ అవసరాలలో 5% అణు విద్యుత్తు ద్వారా తీరుతుంది. అణు విద్యుత్ ప్లాంట్లకు అవసరమైన నియంత్రణ వ్యవస్థ పరికరాలను సరఫరా చేయడానికి ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పిస్తారట.ప్రభుత్వ డేటా ప్రకారం.. భారతదేశంలో 76, 000 టన్నుల యురేనియం ఉందని అంచనా. ఇది 30 సంవత్సరాల పాటు 10,000 మెగావాట్ల అణు విద్యుత్తుకు ఇంధనంగా సరిపోతుంది. ఈ నేపథ్యంలో భారతదేశం తన ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సి ఉంటుంది. ఇంధన విషయంలో దేశం ఎంతో ప్రగతి సాధించాలి. సోలార్, గ్రీన్ హైడ్రోజన్ వైపు నడవాల్సి ఉంది. అణు ఇంధనంపై కూడా దృష్టి సారించి వేగంగా అడుగులు వేయాలి.

అణు విద్యుత్తులో ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానిస్తాం. పెట్రోల్, డీజిల్ దిగుమతుల కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. కొత్త ఇంధనాల సహాయంతో దిగుమతులను తగ్గించుకోవచ్చు. ఆ దిగుమతులు తగ్గితే స్వయం సమృద్ధి సాధ్యమవుతుంది. నేడు ప్రపంచమంతా ఖనిజాల గురించే ఆలోచిస్తోంది' అని తాజాగా ప్రధాని వ్యాఖ్యానించారు.బడ్జెట్‌లో ఎక్కువ భాగం ఇప్పటికీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ దిగుమతి చేసుకోవడానికే పోతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. సౌర, హైడ్రోజన్, జల, అణుశక్తిలో ప్రధాన విస్తరణలతో పాటు సముద్ర వనరులను ఉపయోగించుకునేందుకు నేషనల్ డీప్ వాటర్ ఎక్స్‌ప్లోరేషన్ మిషన్‌నూ ప్రారంభించనట్లు ఆయన ప్రకటించారు.భారత్‌లో అణు విద్యుత్, ఇతర న్యూక్లియర్ పరిశోధనలు పూర్తిగా ప్రభుత్వరంగంలోనే కొనసాగుతున్నాయి. 'అటామిక్ ఎనర్జీ యాక్ట్ -1962' ద్వారా ఈ రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ చట్టం స్థానంలో మోదీ సర్కారు కొత్త చట్టం తీసుకొచ్చి ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించాలని నిర్ణయించింది.

అందుకోసం డిసెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 'ది అటామిక్ ఎనర్జీ బిల్-2025'ను ప్రవేశపెట్టబోతోంది. అణు విద్యుత్ విభాగంలో ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించేలా 2025-26 వార్షిక బడ్జెట్‌లోనే నిర్ణయం తీసుకున్నట్లు గత ఆగస్టులో అణు ఇంధన విభాగం వెల్లడించింది. 'సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్-2010' (సీఎల్ఎన్‌డీ)కి కూడా సవరణలు చేయనున్నారు. ప్రస్తుతం మనదేశంలో ప్రస్తుతం అణువిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 8,880 మెగావాట్లు ఉంది.

దీనిని 2031-32 నాటికి 22,480 మెగావాట్లకు పెంచాలని నిర్ణయించారు. 2070 నాటికి పూర్తిగా కాలుష్యరహిత మార్గాల ద్వారానే (నెట్ జీరో) విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఇంతకుముందు న్యూక్లియర్ భూగర్భ సాంకేతికతపై భారత్ పెరిగిన అసలు శక్తిని చూసి చైనా కూడా ఈ వ్యూహంతో ఇబ్బంది పడుతుందని అంచనా. ఈ కొత్త ప్రణాళిక భారత్‌కు భద్రత, ఆర్థిక వృద్ధికి విప్లవాత్మక మార్గదర్శకంగా నిలుస్తుంది.

### 13 మంది కుటుం సభ్యులను

# కాల్చివేత

### హంతకుడికి బహిరంగ మరణం

### బాలుడితో కాల్చి చంపించిన అఫ్ఘాన్ పోలీసులు

కాబూల్, : తాలిబాన్ పాలిత అఫ్ఘానిస్తాన్‌లోని కోస్ట్ ప్రాంతంలో ఒక సంచలన ఘటన చోటుచేసుకుంది. ఒక హంతకుడికి బహిరంగ శిక్ష అమలు చేయడంలో షాకింగ్ పనిచేశారు ఆఫ్ఘాన్ పోలీసులు. ఒకే ఫ్యామిలీకి చెందిన 13 మందిని దారుణంగా హత్య చేసిన నిందితుడు మంగల్‌ను, 13 ఏళ్ల బాలుడు చేత కాల్చి చంపించారు. శిక్షను స్థానిక స్పోర్ట్స్ స్టేడియంలో 80 వేల మంది ప్రజల ముందు అమలు చేశారు. అఫ్ఘాన్ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ 'ఖిసాస్' అంటే ప్రతీకార శిక్ష జరిగింది.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, మంగల్ 10 నెలల క్రితం అలీ షిర్ టెరెజియో జిల్లాల్లో నివశించే అబ్దుల్ రహ్మాన్.. అతని కుటుంబంలోని 12 మందిని తుపాకీతో కాల్చి చంపాడు.ఈ హత్యలకు అతనికి జీవిత ఖైదు శిక్ష పడింది. శిక్ష అమలు సమయంలో తాలిబాన్ అధికారులు కుటుంబంలో బతికున్న బాలుడు అబ్దుల్ రహ్మాన్ మంగల్‌కు క్షమాభిక్ష పెడతావా అని అడిగారు..

కానీ బాలుడు నిరాకరించడంతో, అతనికి తుపాకీ ఇచ్చి మంగల్‌పై మూడు రౌండ్ల కాల్పులు జరిపించారు. ఈ సందర్భంగా స్టేడియం ఖిద్దు 'అల్లాహు అక్బర్' నినాదాలతో దద్దరిల్లింది.

కోస్ట్ పోలీస్ ప్రతినిధి ఈ ఘటనను ధృవీకరించారు. తాలిబాన్ పాలితంలోషరియా చట్టం కింద ఇలాంటి బహిరంగ శిక్షలు పెరుగుతున్నాయి. అయితే, అంతర్జాతీయ సమాజం ఈ శిక్షను 'అమానవీయమైనది, అత్యంత క్రూరమైనది' అని ఖండిస్తోంది.

# వలయాలను వదిలించుకోండి



పెరుగుతున్న స్క్రీన్ టైమ్ వల్ల.. కళ్లు అనారోగ్యానికి గురవుతున్నాయి. ఎండలు, విటమిన్ల లోపం కూడా.. కళ్లకింద నల్లటి వలయాలకు కారణం అవుతున్నాయి. ఈ చిట్కాలు పాటిస్తే.. నల్లటి వలయాలు వదిలిపోతాయి. ఒక టీస్పూన్ నిమ్మరసానికి, కొద్దిగా కీరదోస రసం, చిటికెడు పసుపు కలిపి.. డార్క్ సర్కిల్స్‌పై అప్లయి చేయాలి. 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. అయితే, ఈ మిశ్రమం కళ్లలోకి పోకుండా చూసుకోవాలి. ఒక టీస్పూన్ శనగపిండిలో కొద్దిగా పసుపు, టమాట రసం వేసి పేస్ట్‌లా చేసుకోవాలి. దీనిని కంటి చుట్టూ అప్లయి చేసి.. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. డార్క్ సర్కిల్స్‌ను తగ్గించడంలో రోజ్ వాటర్ ముందుంటుంది. రాత్రి పడుకునే ముందు రోజ్‌వాటర్‌ను కళ్లపై అప్లయి చేసి.. సున్నితంగా మర్దనా చేయాలి. దీనివల్ల డార్క్ సర్కిల్స్ తగ్గడంతోపాటు కళ్లకు చల్లదనం లభిస్తుంది. కాటన్ బాల్స్‌ను రోజ్ వాటర్‌లో ముంచి.. కళ్లపై పెట్టుకోవాలి. 10 నిమిషాల తర్వాత తీసేయాలి. ఇలారోజూ చేస్తే మెరుగైన ఫలితాలు కనిపిస్తాయి. విటమిన్ ఇ నూనె, కొబ్బరినూనె, ఆలివ్ నూనె మూడింటినీ కలిపి రాత్రి పడుకునే ముందు.. కళ్ల చుట్టూ అప్లయి చేయాలి. వేళ్లతో సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. తెల్లారేసరికి చర్మం మరింత కాంతిమంతంగా కనిపిస్తుంది.

# ఆలస్యం.. విషం!

‘ఆలస్యం అమృతం విషం!’.. అనే సూత్రం భోజనం విషయంలోనూ వర్తిస్తుందని చెబుతున్నారు ఆహార నిపుణులు. ఉరుకుల పరుగుల జీవితాలు, రాత్రి విధులు, పార్టీలు.. ఇలా పలు కారణాల వల్ల చాలామంది రాత్రి భోజనాన్ని ఆలస్యంగా ముగిస్తున్నారు. ఇలాంటి అలవాటు ఆరోగ్యానికి ఏమాత్రం మంచిదికాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాత్రి భోజనం లేటైతే.. పలు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని చెబుతున్నారు. ఆలస్యంగా తినే ఆహారం.. త్వరగా జీర్ణమవ్వదు. దీంతో గ్యాస్, అసిడిటీ, కడుపుబ్బరం వంటి జీర్ణ సంబంధ సమస్యలు ఎదురవుతాయి. ఇక ఇలా భోజనం చేసి, అలా పడుకొంటే.. నిద్రకు ఆటంకం కలుగుతుంది. జీర్ణక్రియ కూడా నెమ్మదిస్తుంది. అర్ధరాత్రి భోజనం చేయడం కొందరికి అలవాటు. దీర్ఘకాలంలో ఈ అలవాటు గుండెకు హాని కలిగిస్తుంది. ఇక ఆహారం



తీసుకోకపోవడం ఆలస్యమైతే.. జీవక్రియ మందగిస్తుంది. ఫలితంగా శరీరంలో కొవ్వు పెరగడం మొదలై..
ఊబకాయం బారినపడే ప్రమాదం ఉంటుంది. రాత్రిపూట కొవ్వులు, చక్కెరతో కూడిన ఆహారం ఎక్కువగా తీసుకుంటే.. పేగు క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది.

# సినిమా..

## కలలోనూ ఊహించలేదు.. : రుక్మిణీ

రుక్మిణీ వసంత్.. నిన్న మొన్నటి వరకు కన్నడ సినీ ఇండస్ట్రీలో ఈ పేరుఫుల్ గా వినిపించింది. అక్కడ తీసిన సప్త సాగరాలు దాటి సిరీస్ చిత్రాలతోపాటు బఘీర వంటి సినిమాలతో ఆమె మంచి పాపులారిటీ సంపాదించుకున్నారు. ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్ లో కూడా సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. పలు సినిమాల్లో నటిస్తున్నారు. రీసెంట్ గా కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ లీడ్ రోల్ లో తెరకెక్కిన మదరాసితో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన రుక్మిణీ.. తన యాక్టింగ్‌తో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు అక్టోబర్ 2వ తేదీన కాంతార చాప్టర్ 1తో సందడి చేయనున్న అమ్మడు.. తాజాగా ఇచ్చిన ఓఇంటర్వ్యూలో పలు విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముందుగా కాంతార ప్రీక్వెల్ మూవీ ఛాన్స్ కోసం మాట్లాడారు. తాను నటించిన సప్తసాగరాలు దాటి, ఏస్ మూవీలను రిషబ్ శెట్టి చూశారని, ప్రీమియర్స్ కు వచ్చి తన నటనను మెచ్చుకున్నారని తెలిపారు. కాంతార చాప్టర్ 1లో యాక్ట్ చేసే అవకాశం తనకు వస్తుందని కలలో కూడా ఊహించలేదని చెప్పుకొచ్చారు రుక్మిణీ వసంత్. ఆయన తన సినిమాల ప్రీమియర్స్ చూసి ఛాన్స్ ఇచ్చారని భావిస్తున్నట్లు చెప్పారు. కాంతార టీమ్ తన ఫోన్ చేసి ఇందులో యాక్ట్ చేస్తారా అని అడిగినప్పుడు అప్పుడు వచ్చిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేనని తెలిపారు. కాంతార ప్రీక్వెల్ 4,5 శతాబ్దాల మధ్య జరిగే కథ అని, అప్పటి పరిస్థితులకు తగినట్లు నటించాలని రుక్మిణీ వసంత్ చెప్పారు.



## రీఎంట్రీ బాలయ్య సినిమాతోనే



ఎన్టీఆర్ బయోపిక్స్ కథానాయకుడు, మహానాయకుడు సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరవయ్యారు బాలీవుడ్ నటి విద్యాబాలన్. ఆ చిత్రాల్లో ఆమె ఎన్టీఆర్ సతీమణి బసవతారం పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ తెలుగు తెరపై విద్యాబాలన్ కనిపించలేదు. అయితే.. మళ్లీ ఆమె టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారనేది లేటెస్ట్ న్యూస్. అది కూడా బాలయ్య సినిమాతోనేనట. ప్రస్తుతం బ్లాక్‌బస్టర్ ‘అఖండ’ సీక్వెల్ ‘అఖండ – తాండవం’ షూటింగ్‌లో బాలయ్య బిజీగా ఉన్న విషయం తెలిసిందే. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో విద్యాబాలన్ ఓ కీలక పాత్ర పోషించనున్నారట. ఇందులో కథ రీత్యా ఓ పవర్‌ఫుల్ పొలిటికల్ లీడర్ పాత్ర ఉందట. ఆ పాత్రకోసం విద్యాబాలన్‌ని బోయపాటి సంప్రదించారనీ, కథ, పాత్ర విన్న తర్వాత ఆమె చేయడానికి అంగీకరించారని సమాచారం.

## ఎంత హైటున్న హీరో అయినా ఒకే!



టాలీవుడ్ కి పరిచయమైన యంగ్ బ్యూటీ ఇవానా గురించి చెప్పాల్సిన పనిలేదు. తొలి సినిమాతోనే అమ్మడు యువత అటెన్షన్ డ్రా చేసింది. యూత్ ఫుల్ లవ్ స్టోరీ తో కుర్ర కారులో క్రేజీ బ్యూటీగా మారిపో యింది. వైవిధ్యమైన హావభావాలతో ప్రేక్షకులకు దగ్గరైంది. ఇటీవలే సింగిల్ తో తెలుగులోనూ లాంచ్ అయింది. ఈ సినిమా కూడా మంచి విజయం సాధించింది. కేతిక పాత్ర కంటే ఇవానా పాత్రకే మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో ఓ ఛాన్స్ అందు కుందనే ప్రచారం జరుగుతోంది. సక్సెస్ పరంగా ఇవానా ట్రాక్ బాగుంది. కోలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ పాజిటివ్ గానే కనిపి స్తుంది. యూత్ లోనూ క్రేజీ బ్యూటీ గా వైరల్ అవుతోంది. –సింగిల్– తర్వాత తెలుగులో ఫాలోయింగ్ రెట్టింపు అయింది. ఇక ఇవానా వయసు విషయానికి వస్తే అమ్మడికి 25 ఏళ్లు. అంటే స్టార్ హీరోలందరితో నటించే వయసే. 20 ఏళ్ల నటే 50–40 ఏళ్ల వయసున్న హీరోలతో రొమాన్స్ చేస్తున్నారు.

# మీరు రోజూ తాగే టీ లేదా కాఫీలకు బదులుగా ఈ డ్రింక్స్‌ను తాగండి..




చాలా మంది ఉదయం నిద్ర లేచిన వెంటనే తమ రోజును టీ లేదా కాఫీతో ప్రారంభిస్తారు. కొందరు రోజు మొత్తం టీ లేదా కాఫీలను అదే పనిగా తాగుతుంటారు కూడా. అయితే టీ, కాఫీలను మోతాదుకు మించి తాగితే ఆరోగ్యానికి చేటు చేస్తాయి. శరీరంలో కెఫీన్ స్థాయిలు పెరిగిపోతాయి. ఇది అనేక అనారోగ్యాలకు దారి తీస్తుంది. శరీరంలో కెఫీన్ పెరిగితే జీర్ణ సమస్యలు వస్తాయి. గుండె దడగా ఉంటుంది. బీపీ పెరిగిపోతుంది. రాత్రిపూట నిద్ర సరిగ్గా పట్టదు. ఇలా శరీరంలో అధికంగా ఉండే కెఫీన్ మనకు అనేక రకాలుగా హాని చేస్తుంది. అయితే టీ, కాఫీ తాగకపోతే ఎలా.. వాటిని తాగకుండా ఎలా ఉండగలం.. అని అనుకునే వారు ఇప్పుడు చెప్పబోయే పలు డ్రింక్స్‌ను తాగవచ్చు. వీటిని టీ లేదా కాఫీకి ప్రత్యామ్నాయంగా సేవించవచ్చు. వీటిల్లో ఎలాంటి హానికర సమ్మేళనాలు ఉండవు. కనుక ఈ డ్రింక్స్‌ను తాగితే ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చు.

**గ్రీన్ టీ..:** టీ, కాఫీలకు బదులుగా గ్రీన్ టీని తాగడం అలవాటు చేసుకోండి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. మెటబాలిజంను పెంచుతాయి. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. శరీరంలోని కొవ్వు కరిగిపోతుంది. అధిక బరువు తగ్గుతారు. కమోమిల్, పెప్పర్ మింట్, మందార పువ్వులతో చేసిన హెర్బల్ టీలను సేవిస్తుండాలి. టీ లేదా కాఫీకి ప్రత్యామ్నాయంగా ఈ పానీయాలను సేవించవచ్చు. ఇవి జీర్ణ క్రియను మెరుగు పరుస్తాయి. వీటిల్లో కెఫీన్ ఉండదు. ఒత్తిడిని తగ్గిస్తాయి. శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. సీజనల్ వ్యాధుల నుంచి రక్షణను అందిస్తాయి.

టీ లేదా కాఫీకి ప్రత్యామ్నాయంగా మచా టీని కూడా సేవించవచ్చు. ఇది ఆకుపచ్చ రంగులో ఉంటుంది. అంత ఆకర్షణీయంగా ఉండదు. కానీ ఈ టీని తాగితే ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు. ఈ టీలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలోని శక్తి స్థాయిలను పెంచుతాయి.

**పసుపు టీ..:** టీ లేదా కాఫీలకు బదులుగా పసుపు టీని కూడా తాగవచ్చు. కాస్త పసుపును నీటిలో వేసి మరిగించి తాగాల్సి ఉంటుంది. పసుపులో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. ఆర్థరైటిస్ నొప్పులు ఉన్నవారికి ఎంతగానో మేలు చేస్తాయి. పసుపు రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది. గాయాలు, పుండ్లు త్వరగా మానేలా చేస్తుంది. దాల్చిన చెక్క, యాలకులు, అల్లం వేసి తయారు చేసిన కషాయాన్ని టీ లేదా కాఫీకి బదులుగా తాగవచ్చు. ఇది జీర్ణక్రియను పెంచుతుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. **కొబ్బరి నీళ్లు..:** కొబ్బరి నీళ్లను కూడా టీ, కాఫీలకు మంచి ప్రత్యామ్నాయం అని చెప్పవచ్చు. మీకు టీ లేదా కాఫీ తాగాలని అనిపిస్తే కొబ్బరి నీళ్లను ఒక గ్లాస్ తాగండి చాలు, ఎంతో మేలు జరుగుతుంది.



# ఏ వడ్డీ మంచిది

సంపాదన ఎంత పెరిగినా.. అప్పుల తిప్పలు మాత్రం తప్పడం లేదు. ఇంటి కోసమో.. కారు కొనడానికో.. వ్యక్తిగత అవసరాలకో రుణాలు తీసుకోవాల్సి వస్తున్నది. ఇలాంటి సందర్భాల్లో వడ్డీరేట్ల గురించి కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఎందుకంటే.. ఈ వడ్డీరేట్లే రుణగ్రహీతలపై ఆర్థిక భారం పెరిగేలా చేస్తాయి. ప్రస్తుతం బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు.. రెండు రకాల వడ్డీ రేట్లను వసూలు చేస్తున్నాయి. అవి.. ఫిక్స్‌డ్ వడ్డీరేటు, ఫ్లోటింగ్ వడ్డీరేటు. అప్పులు చేయడంలో ఆరితేరినవారికి వీటి గురించి తెలిసినా.. కొత్తవారికి కొంచెం కొత్తగానే అనిపిస్తాయి. పూర్తిగా తెలుసుకుంటేనే.. ఆ తర్వాత ఆర్థికభారం పడకుండా కాపాడతాయి.

ఫిక్స్‌డ్ రేట్లు: ఈ వడ్డీరేట్లు ఎప్పుడూ స్థిరంగానే ఉంటాయి. లోన్ తీసుకున్నప్పటి నుంచి.. టెన్యూర్ ముగిసేవరకు వడ్డీరేటు ఒకేరకంగా ఉంటుంది. ప్రతినెలా చెల్లించాల్సిన ఈఎంఐ కూడా అంతే ఉంటుంది. కాబట్టి, నెలకు ఎంత ఈఎంఐ కట్టాలో ముందే అవగాహన ఉంటుంది. ముఖ్యంగా.. ఎక్కువ రోజులు టెన్యూర్ లోన్ల కోసం ఈ ఫిక్స్‌డ్ వడ్డీరేట్లు బాగుంటాయి.

ఫ్లోటింగ్ రేట్లు: ఇవి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. ఫిక్స్‌డ్ రేట్ల కంటే తక్కువగా ఉండే ఈ ఫ్లోటింగ్ వడ్డీరేట్లు.. దీర్ఘకాలిక రుణాలకు ప్రయోజనకరంగా ఉంటాయి. సుదీర్ఘకాలంలో వడ్డీరేటు తగ్గింపుల నుంచి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. ఆర్బీఐ రెపో రేటును తగ్గించినప్పుడు, బెంచ్‌మార్క్ రేటు తగ్గినప్పుడు ఫ్లోటింగ్ రేటు కూడా తగ్గుతుంది. అంటే.. ఇంటి రుణంపై వడ్డీరేటు కూడా తగ్గుతుంది. దాంతో, నెలనెలా కట్టాల్సిన ఈఎంఐ కూడా తక్కువ అవుతుంది. అంతేకాదు, పలు బ్యాంకులు/ఆర్థిక సంస్థలు.. రుణాలను ముందస్తుగా చెల్లిస్తే పెనాల్టీని వసూలు చేస్తుంటాయి.

అదే.. ఫ్లోటింగ్: వడ్డీరేట్‌లో తీసుకున్న రుణాలకు ఈ సమస్య ఉండదు. కాబట్టి, ఎలాంటి ఇబ్బంది లేకుండానే రుణాలను ముందస్తుగా తీర్చే అవకాశం ఉంటుంది. అదే సమయంలో.. ఫ్లోటింగ్ వడ్డీరేట్లకు కొన్ని ప్రతికూలతలు కూడా ఉంటాయి. ఆర్బీఐ రెపోరేటు పెంచినప్పుడు, బెంచ్‌మార్క్ రేటు కూడా పెరుగుతుంది. అప్పుడు మీరు చెల్లించాల్సిన వడ్డీ రేటుతోపాటు ఈఎంఐ లేదా రుణ కాలవ్యవధి పెరుగుతుంది. ఇది.. తక్కువ ఆదాయ వర్గాలకు ఇబ్బందికరంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈఎంఐ డిఫాల్ట్ అయితే.. క్రెడిట్ స్కోరు తగ్గిపోతుంది. అందుకే ఫ్లోటింగ్ వడ్డీ రేటుతో లోన్ తీసుకునేటప్పుడు అన్ని విషయాలూ ముందుగానే చూసుకోవాలి... ఈ రెండిట్లో ఏ వడ్డీరేటును ఎంచుకోవాలనేది వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా అప్పులు తిరిగి చెల్లించగలిగే సామర్థ్యం, రుణగ్రహీతల ఆర్థిక స్తోమతను బట్టి నిర్ణయాలు తీసుకోవాలి. దీర్ఘకాలిక ప్రణాళికలు ఉన్నవారు, ప్రతినెలా చెల్లించే ఈఎంఐ మారకూడదని అనుకునేవారికి ఫిక్స్‌డ్ వడ్డీరేటు బాగుంటుందని నిపుణులు చెబుతున్నారు. బ్యాంకుల్లో వడ్డీరేట్లు తగ్గే అవకాశాలు ఉన్నప్పుడు, తక్కువ సమయంలోనే రుణాలు తీర్చేస్తామని అనుకునేవారు ఫ్లోటింగ్ వడ్డీరేట్లు ఎంచుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు.

# సాధనతో సాధ్యమే



చిన్నప్పుడు చదివిన కుందేలు, తాబేలు పరుగు పందెం కథ గుర్తుంది కదా!నిర్లక్ష్యం ఎంత ప్రమాదమో ఆ కథ చెబుతుంది. అలాగే పట్టుదలే గెలుపుబాట అని చూపుతుంది. ఆ తాబేలు పరుగునే ఆదర్శంగా తీసుకుంది ప్రముఖ ఆంత్రప్రెన్యూర్ వినీతా సింగ్. సోనీ టీవీలో ప్రసారమయ్యే ‘షార్క్ ట్యాంక్ ఇండియా’ కార్యక్రమం జడ్జిగా కూడా సేవలు అందిస్తున్నది. చిన్నప్పటి నుంచి వినీతకు నడక అంటే ఇష్టం. మారథాన్ పరుగులో నిర్దేశిత సమయంలో లక్ష్యాన్ని అందుకోవాలని ఉండేది.వేగాన్ని, దూరాన్ని పట్టించుకోకుండా తన సామర్థ్యాన్ని పెంచుకోవడం కోసం చాలా కాలంగా ప్రయత్నిస్తున్నది. మొదట్లో చాలా సమయంపాటు నడిచేదట. కొన్నాళ్లకు నడక వేగం పెంచింది. ఇంకొన్నాళ్లకు పరుగు అందుకుంది. వారం వారం దూరాన్ని పెంచుకుంటూ పరుగు తీసింది. పదిహేడేండ్లుగా పరుగు ఒక కళగా సాధన చేసింది. ఇటీవల జరిగిన ముంబయి మారథాన్‌లో 42 కిలోమీటర్ల దూరాన్ని 3 గంటల 58 నిమిషాల 21 సెకన్లలో చేరుకుని ‘ఔరా!’ అనిపించుకుంది. ‘జీవితంలో ఏదైనా సాధించాలనే ప్రయత్నంలో వెంటనే విజయాన్ని ఆశించడం తప్పు కాదు. అయితే, దానికి తగినంత సామర్థ్యాన్నిపెంపొందించుకోవాలి. పరిస్థితులు అనుకూలించకపోయినా.. నిరుత్సాహపడొద్దు. అన్నిటినీ మించి పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు’ అని చెప్పుకొచ్చింది వినీత.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com